
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 13 నవంబరు 2024



# ..రయ్‌రయ్

సర్వాంగ సుందరంగా.. అధునాతనంగా.. ఆహ్లాదకరంగా.. రక్షణాత్మకంగా.. పర్యావరణహితంగా.. చిలకలూరిపేట బైపాస్ అందుబాటులోకి వచ్చేసింది. ఎన్నో ఏళ్లుగా.. చిలకలూరిపేటవాసుల కలగా.. చిలకలూరిపేట మీదగా రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడే వారి కష్టాలను తీరుస్తూ ఎట్టకేలకు బైపాస్ నిర్మాణం జరిగింది. 16వ నంబరు జాతీయ రహదారిపై గుంటూరు, ఒంగోలు మధ్య చిలకలూరిపేట పట్టణాన్ని బైపాస్ చేస్తూ సుమారు రూ.వెయ్యి కోట్ల వ్యయంతో 16.384 కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో నిర్మాణం చేశారు. దేశంలోనే మొదటిసారిగా మోడల్ బైపాస్‌గా రూపొందించిన ఈ రోడ్డుపై వాహనదారులు రయ్‌రయ్‌మంటూ త్వరలో ప్రయాణించనున్నారు. ఎన్నో ప్రత్యేకతలతో నిర్మాణం జరిగిన బైపాస్‌ను ఈ నెలాఖరుకు ప్రారంభించే అవకాశం ఉంది.



పూర్తయిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డు


- సుందరంగా చిలకలూరిపేట బైపాస్
- దేశంలోనే మొదటి మోడల్ బైపాస్ రోడ్డు
- ఈ నెలాఖరులో ప్రారంభించడానికి సన్నాహాలు
- చిలకలూరిపేటకు మణిహారంగా రోడ్డు నిర్మాణం

### బైపాస్ రోడ్డు ప్రత్యేకతలు

- చిలకలూరిపేట బైపాస్ రోడ్డుకు రెండు వైపులా 16 కిలోమీటర్ల పొడవునా శాశ్వత గోడ నిర్మాణం.
- గణపవరం వద్ద విశాలమైన ప్రదేశంలో రెండు చోట్ల ఒక మెగా వాట్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు.
- రోడ్డు పొడవునా ఒకవైపున ట్రీ గార్డులతో 3,500 మొక్కలను నాటుతున్నారు. డివైడర్లపై కాగితం పూల మొక్కలను నాటారు.
- బైపాస్ రోడ్డులో అత్యంత అధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ కెమెరాల ఏర్పాటు చేశారు.
- ఒంగోలు గుంటూరు మధ్య ప్రయాణం చేసే వాహనదారులకు సుమారు 30 నిమిషాల సమయం ఆదా.
- మొత్తం మూడు ఫ్లై ఓవర్లు, ఆరు అండర్ పాస్‌ల నిర్మాణం

చిలకలూరిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎన్నో సవాళ్లు.. మరెన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు చిలకలూరిపేట బైపాస్ రహదారి అందుబాటులోకి వచ్చేసింది. జాతీయ రహదారిపై మార్టూరు గుంటూరు మధ్య రామచంద్రాపురం వద్ద ప్రారంభమై తిమ్మాపురం గ్రామం వరకు నిర్మాణం జరిగింది. బైపాస్ రోడ్డు భూసేకరణకు సుమారు రూ.300 కోట్లు ఖర్చు చేయగా, రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.700 కోట్లు ఖర్చు చేశారు. సర్వాంగ సుందరంగా, వాహనదారులకు ఇబ్బంది లేని రీతిలో బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో ఓగేరు, కుప్పగంజి వాగులపై రెండు వంతెనలను నిర్మించారు. ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ ల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బొప్పూడి

(మిగతా 8లో)



1. సర్వీస్ రోడ్ పక్కన నిర్మించిన బస్సు షెల్టర్
2. నరసరావుపేట మార్గంలో నిర్మించిన అండర్ పాస్
3. బైపాస్ పక్కన ఏర్పాటుచేసిన సోలార్ వ్యవస్థ



# చీఫ్‌విప్‌గా జీవీ

- ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- ఆంజనేయులు కష్టానికి దక్కిన ఫలితం
- ఎట్టకేలకు పల్నాడు జిల్లాకు కీలక పదవి



నరసరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ చీఫ్‌విప్‌గా వినుకొండ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. మంత్రివర్గంలో ఇటు గుంటూరు నుంచి ఇద్దరికి, అటు బాపట్ల జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు వరించాయి. అయితే పల్నాడు జిల్లాకు ఒక్క మంత్రి పదవికి కూడా దక్కలేదు. ఈ పరిస్థితుల్లో పల్నాడు జిల్లాకు ఎట్టకేలకు కీలక పదవి దక్కింది. వినుకొండ నుంచి గోనుగుంట్ల వెంకట శివ సీతారామాంజనేయులు(జీవీ) మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రతిపక్షంలో ఐదేళ్లు పార్టీ అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారు. ఈక్రమంలో ఆయన కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. జీవీకి మంత్రి పదవి వస్తుందని జిల్లా పార్టీ వర్గాలు భావించాయి. అయితే మంత్రివర్గ కూర్పులో కులాల సమీకరణల కారణంగా జీవీకి మంత్రి పదవి దక్కలేదు. ఈ పరిస్థితుల్లో

(మిగతా 8లో)

## పడవ రేవులకు గిరాకీ

గింజుపల్లికి రూ.54 వేలు ఉంటే.. రూ.3.50 లక్షలకు పాడారు

మాదిపాడుకు,తాడువాయి రేవులకు పోటాపోటీ

వల్లభాపురానికి ఒక్కరు కూడా రాలేదు

8

## ఏపీలో జపాన్ విద్యా విధానం

టోయామా యూనివర్సిటీతో ఒప్పందం

ఏఎన్‌యూలో జపాన్ బృందం సమావేశం.. హాజరైన ఆరు వర్సిటీల వీసీలు

8



వర్సిటీ వీసీ, అధికారులతో భేటీ అయిన జపాన్ బృందం

తెనాలి రైల్వేస్టేషన్‌లో రూ.35 లక్షల వెండి పట్టివేత

6

డిప్యూటేషన్ పేరిట తిష్ఠ.. అవినీతికి పరాకాష్ఠ

# సహకార.. ఎన్నికలేనా?

◆ ఎన్నికలపై ఆసక్తి చూపని ప్రభుత్వం ◆ త్రి సభ్య కమిటీల కొనసాగింపునకు కసరత్తు ◆ ఐదేళ్లుగా అధికారుల చేతిలో సొసైటీల నిర్వహణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల ప్రయోజనాలే పరమావధిగా సొసైటీలు పనిచేయాలి. అయితే ఇందుకు గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచే నిర్ణయాలతో సరిపెట్టింది. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను నియమిస్తూ కాలయాపన చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని రైతులు ఆశించారు. ఈ క్రమంలో గత ప్రభుత్వం నియమించిన త్రి సభ్య కమిటీలు రాజీనామా చేశాయి. అయితే సొసైటీల ఎన్నికలను నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కూడా ఆసక్తి చూపడంలేదన్న వాదన రైతుల నుంచి వినిపిస్తోంది. ఈ మేరకు కమిటీలను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని సమాచారం. సొసైటీల ఎన్నికలకు సంబంధించి సభ్యులను గుర్తించాల్సి ఉంది. ఈ ప్రక్రియలో జాప్యం జరిగే అవకాశం ఉండటంతో కొత్త ఓటర్ల జాబితాలు రూపొం దించే వరకు ప్రత్యేక పాలన కొనసాగించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు సహకార వ ర్గాలు చెబుతున్నాయి. దీంతో కొంత కాలం ఎన్ని కలు వాయిదా పడినట్లేనన్న ప్రచారం జరుగు తోంది. సొసైటీల నిర్వహణ ప్రస్తుతం అధికారుల చేతిలో ఉంది. ముగ్గురు లేదా ఐదుగురు అధికా రులను సొసైటీలకు నామినేట్ చేయాలని ప్రభు త్వం నిర్ణయించినట్లు సమాచా రం. ముగ్గురా.. ఐదుగురా అన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.



జొన్నలగడ్డ సొసైటీ భవనం

**2019 నుంచి అధికారుల చేతుల్లోనే సొసైటీలు**

సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 2018లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అధ్యక్షుల పదవీ కాలాన్ని 2019 వరకు పొడిగించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా సొసైటీల్లో ప్రత్యేక పాలన ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆరు నెలలకొకసారి త్రి సభ్య కమిటీల పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది.

### ఇష్టారాజ్యంగా కమిటీలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కొన్ని సహకార సంఘాలలో త్రి సభ్య కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయన్న విమర్శలున్నాయి. కొన్ని చోట్ల రైతులను ఇబ్బందులకు గురిచేశాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమించుకున్నాయి. కొన్ని త్రి సభ్య కమిటీలు ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కి అక్రమ మార్గంలో ఉద్యోగులను నియమించుకున్నాయన్న ఆరోపణలున్నాయి. ఆయా నియామకాలకు పాత తేదీలను నమోదు చేసుకుని మినిట్స్ రాసుకున్నట్లు సమాచారం. ఎన్నికలు లేక పోవడంతో తాత్కాలిక కమిటీలు పలు అక్రమాలకు పాల్పడ్డాయన్న విమర్శలున్నాయి. పంట రుణాలు మంజూరులో కూడా రాజకీయంగా కమిటీలు ఇబ్బందులకు గురిచేసినట్లు రైతులు వాపోతున్నారు.


# యార్డుకు.. లక్షన్నర టిక్కీలు

క్వింటాల్‌కు రూ.1500 తగ్గిన ధర

మిర్చి విక్రయానికి పోటీపడుతోన్న రైతులు

కృష్ణ, ప్రకాశం, నంద్యాల నుంచి కూడా రాక

50 వేల టిక్కీలకే ఈనామ్‌లో బిడ్డింగ్ అవకాశం



గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చి కొత్త పంట రాక ప్రారంభం అవుతుండగా.. కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేసిన టిక్కీలను విక్ర యించేందుకు రైతులు పోటీ పడుతున్నారు. ఈ రెండు నెలల్లో విక్రయించుకోలేకపోతే జనవరి నుంచి గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి వచ్చే కొత్త పంటతో ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తూ ప్రస్తుత అన్‌సీజన్‌లో రోజుకు లక్షన్నర టిక్కీల శాంపిల్స్‌ని విక్రయానికి పెడుతున్నారు. ఎగుమతుల డిమాండ్ లేకపోవడంతో కనీసం 50 శాతం టిక్కీలు కూడా కొనుగోళ్లు జరగడం లేదు. దీంతో ధర నేలచూపులు చూడటం ప్రారంభించింది. కొద్ది రోజుల నుంచి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచే కాకుండా కృష్ణ, ప్రకాశం, నంద్యాల నుంచి కూడా రైతులు కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి మిర్చి టిక్కీలను తీసుకొస్తున్నారు. అన్ సీజన్‌లో రైతులు కేవలం శాంపిల్స్ మాత్రమే తీసుకొస్తారు. ఆయా శాంపిల్స్‌కు సంబంధించిన లాట్స్‌లో ఎన్ని టిక్కీలు ఉన్నాయో పేర్కొంటారు. ఆ విధంగా చూసుకుంటే రోజుకు 1.50 లక్షల టిక్కీలకు సంబంధించిన శాంపిల్స్ పెడుతున్నారు. అన్ సీజన్‌లో ఇంత భారీగా మిర్చి టిక్కీలను విక్రయానికి పెట్టిన దాఖలాలు గతంలో లేవు. ఈ కారణంతో మేలిమి రకాలు నెల క్రితం క్వింటాల్ రూ.18500 దాటగా నేడు రూ.1500లకు పైగా తగ్గాయి. మంగళవారం గుం టూరు మిర్చియార్డులో తేజ వెరైటీ క్వింటాల్ రూ.16500, ఆర్మూరు, బ్యాడిగి రకాలు రూ.12500, 334 రకం రూ.13 వేలు ధర మాత్రమే లభించింది.

### క్షీణించిన ఎగుమతులు

బంగ్లాదేశ్, చైనా దేశాలకు ఎగుమతులు తగ్గిపోయాయి. బంగ్లాదేశ్‌లో కొత్త పంట మార్కెట్‌ని ముంచెత్తడంతో దాని ప్రభావం తేజపై పడింది. చైనాలోనూ కొత్త పంట వచ్చిన కారణంగా ఆ దేశ దిగుమతిదారులు ఆర్డర్స్ పెట్టడం లేదు. మిర్చియార్డులో ఎక్స్‌పోర్టు వెరైటీలుగా తేజ, బ్యాడిగి, ఆర్మూరుకు గుర్తింపు ఉన్నది. మిగతా రకాలన్నీ కారం తయారీకి వినియోగిస్తారు. అలాంటిది ఇప్పుడు తేజ, బ్యాడిగి, ఆర్మూరుకు డిమాండ్ లేకపోవడంతో ఎగుమతులు జరగడం లేదు. శీతల గిడ్డంగుల్లో నేటికీ 35 లక్షల మిర్చి టిక్కీల వరకు నిల్వ ఉన్నట్లు మార్కెటింగ్ వర్గాల సమాచారం. కర్ణాటక, నంద్యాల నుంచి రోజుకు వెయ్యికి పైగా కొత్త మిర్చి పంట టిక్కీలు వస్తున్నాయి. వీటి వల్ల కోల్డ్‌స్టోరేజ్‌లలోని నిల్వలు నెమ్మదిగా తగ్గుతున్నాయి. మరో రెండు నెలల పాటు రోజుకు 50 వేలకు పైగా మిర్చి టిక్కీల విక్రయం జరిగితేనే కోల్డ్‌స్టోరేజ్‌లు ఖాళీ అవుతాయి. కాగా ప్రస్తుతం నిల్వ ఉన్న టిక్కీలలో 15 లక్షల టిక్కీల వరకు తాలుకాయలు ఉన్నట్లు సమాచారం.

# యథేచ్ఛగా.. మట్టి దోపిడీ

మట్టి మాఫియా దెబ్బకు చెరువులు, కుంటలు, వాగులు వంకలే కాదు ఎంతో విలువైన ప్రభుత్వ భూములు కనుమరుగవుతున్నాయి. వందలాది ఎకరాలు అక్రమార్కుల చేతిలో పడి చెరువులుగా మారుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం తవ్వకాలు జరిపి టిప్పర్లకొద్దీ మట్టిని తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. పట్టపగలు కళ్ల ముందే వందలాది టిప్పర్ల మట్టి తరలిపోతున్నా, అడ్డుకునే వారుగాని, ప్రశ్నించేవారు కాని లేరు. ఇదీ యడ్లపాడు మండలం సంగంగోపాలపురం ప్రభుత్వ భూముల్లో నిత్యం జరుగుతున్న మట్టి తవ్వకాల పరిస్థితి.

చెరువులుగా మారుతున్న ప్రభుత్వ భూములు

చోద్యం చూస్తున్న అధికారులు




సంగంగోపాలపురం ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు

యడ్లపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం సంగంగోపాలపురం గ్రామ పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. అవి శతాబ్దం క్రిందట గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సాగునిమిత్తం భూములను అసైన్డ్ చేశారు. అప్పటి నుంచీ వారు ఆ భూముల్లో వివిధ రకాల పంటలను సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్లపాటు సాగుచేసుకుంటున్నారు. గత రెండు దశాబ్దాలుగా స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతుండడం వెంచర్లకు, రహదారుల విస్తరణకు మట్టి దొరక్క డిమాండ్ ఏర్పడింది. దీనితో మట్టి మాఫియా సంగంగోపాలపురం ప్రభుత్వ భూములపై దృష్టి సారించారు. పేదల ఆర్థిక అవసరాలను అలుసుగా తీసుకుని వారి వద్ద నుంచి భూములను కారు చౌకగా కొనుగోలుచేసి మట్టి తవ్వకాల దందాను ప్రారంభించారు. అప్పటి నుంచి ఏ ప్రభుత్వం వచ్చినా అక్రమార్కులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే తమ దందాను కొనసాగిస్తూనే ఉన్నారు. నీటి ఊటలు వచ్చేంతగా 30 అడుగులకు పైగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఎవరైనా కొత్త వ్యక్తి ఆ ప్రాంతానికి వెళ్లాలన్నా భయపడే పరిస్థితి.ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు.

### గతంలోనూ వారే..

ప్రస్తుతం సంగంగోపాలపురం భూముల్లో తవ్వకాలు జరుపుతున్న వారిలో అధికులు బోయపాలెం గ్రామానికి చెందిన ఓ వర్గానికి చెందినవారు కావడం విశేషం కాగా వారంతా గత ప్రభుత్వంలోనూ వైసీపీ వారిని ఆకట్టుకుని మట్టి దందాను నిర్వహించిన వారే. వారంతా మండల నాయకుడి వర్గానికే చెందిన చెందిన వారు కావడంతో ఏ పార్టీ వారన్నదానితో సంబంధం లేకుండా సదరు నాయకుడు వా రికి అండగా నిలుస్తున్నట్లు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికే వారు గ్రావెల్ మాఫియాతోపాటు ఇసుక దందా కూడా సాగిస్తున్నారు. గత ఐదేళ్లు బయటకు రాని వారు నేడు విస్తృతంగా మట్టి దందా సాగించడంపై సొంత పార్టీ వారే ఆగ్రహం వ్యక్తం చేస్తుండం విశేషం.



చెరువులుగా మారిన ప్రభుత్వ భూములు

### చెరువులుగా మారుతున్న ప్రభుత్వ భూములు

సంగంగోపాలపురం గ్రామ పరిధిలో సుమారు 650 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నట్లు అంచనా. గత రెండు దశాబ్దాల కాలంలో ప్రభుత్వ అవసరాలకు, పెద్దలు ఆక్రమించుకున్న భూములు పోగా సుమారు 200ఎకరాలలో మట్టి తవ్వకాలు జరిగి ఉంటాయని అంచనా. ప్రస్తుతం తవ్వకాలు జరిపిన ప్రాంతాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరుచేరి నిండుకుండను తలపిస్తున్నాయి.

### టిప్పరు గ్రావెల్ రూ.7వేలు..

సంగంగోపాలపురం పరిధిలోని మట్టికి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎంతో డిమాండ్ ఉంది. దీనికి తోడు ప్రభుత్వం మారడంతో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. గుంటూరు చుట్టుప్రక్కల ఎన్నో వెంచర్లు కొత్తగా వెలిశాయి. వెంచర్లలో రోడ్లకు పెద్ద ఎత్తున గ్రావెల్ అవసరం అవుతోంది. దీనితో దూరాన్ని బట్టి టిప్పర్ గ్రావెల్‌ను రూ.7వేల నుంచి రూ.8వేల వరకు విక్రయిస్తున్నారు. నిత్యం 150 నుంచి 200 టిప్పర్లు మట్టి ఇక్కడి నుంచి తరలి వెళుతోందంటే ఇక్కడి మట్టికి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్రమార్కుల ఆదా యం రోజుకు రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు ఉంటుందంటే ఆశ్చర్యం లేదు.

### గురుకుల పాఠశాల సమీపంలో..

బోయపాలెం పరిధిలోని అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలకు ఆనుకుని సుమారు ఐదెకరాల ప్రభుత్వ బూమిలో ఇబ్బడి ముబ్బిడిగా మట్టి తవ్వకాలు జరిపి చెరువుగా మార్చి వేశారు. పాఠశాలలో 5 నుంచి 10 తరగతులు చదివే సుమారు 450మంది విద్యార్థులు ఉన్నారు.

### అనుమతులు లేకుండానే..

ప్రభుత్వ భూమి అయినా, ప్రైవేటు భూమి అయినా రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతులు అవసరం. అనుమతులు తీసుకున్న తరువాత మైనింగ్ శాఖకు సీనరేజి చెల్లించి బిల్లులు తీసుకుని మట్టి తోలకాలు చేయాలి. అటువంటి అనుమతులు ఏమీ లేకుండానే ప్రభుత్వ బూముల్లో తవ్వకాలు సాగిస్తున్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం ఏఎంఆర్ సంస్థకు మైనింగ్ సెస్సు వసూలుకు అనుమతులిచ్చింది. వారు కేవలం సీనరేజి బిల్లులు మంజూరు చేస్తున్నారే తప్ప సదరు మట్టి తోలకాలకు రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతులు తీసుకున్నారా లేదా అని చూడడం లేదు. దీనితో అక్రమార్కులు తమకు అనుమతులు ఉన్నాయని, మీకు చేతనైనది చేసుకోండంటూ ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం చేస్తున్నారు. పెద్దఎత్తున ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

## అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లుగా రామకృష్ణ, వెంకటేశ్వరరావు


బొమ్మిడి రామకృష్ణ, విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు

రేపల్లె,నవంబరు12(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నిజాంపట్నంకు చెందిన బొమ్మిడిరామకృష్ణ, విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావును నియమించారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రామకృష్ణను, వెంకటేశ్వరరావును పలువురు టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు అభినందించారు. అగ్నికుల క్షత్రియుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని రామకృష్ణ, వెంక టేశ్వరరావులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందీశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.

### గుంటూరు నగరపాలక సంస్థ

**ఇ-ప్రోక్యూర్‌మెంటు టెండరు ప్రకటన**

ఇ.టి.నెం. 32,33/2024-25 తేది : 8.11.2024

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను ఇ-ప్రోక్యూర్‌మెంట్ మార్కెట్ విధానము ద్వారా టెండర్లను రిజిష్టరు కాంట్రాక్టుదారుల నుండి కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.apeprocurement.gov.in (procurement market place) వద్ద చూడవచ్చును.

| | | |
|---|---|---|
| ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు | - | 32,33/2024-25. |
| మొత్తం పనులు సంఖ్య | - | 18 |
| అంచనా మొత్తం | - | 2,05,58,200/- |
| టెండరు బిడ్‌లు కనపడు తేది | - | 08-11-2024 ఉ॥10:30 గంటలకు |
| టెండరు బిడ్‌లు వేయుటకు ఆఖరు తేది | - | 22-11-2024 సా॥3:00 గంటలకు |
| టెండరు బిడ్‌లు తెరచు తేది | - | 22-11-2024 సా॥3:30 గంటలకు |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నగరపాలక సంస్థ, గుంటూరు

# డిప్యూటేషన్ పేరిట తిష్ఠ.. అవినీతికి పరాకాష్ఠ

- ఓ ద్వితీయశ్రేణి అధికారిపై వల్లమాలిన ప్రేమ!
- పాఠశాల విద్యాశాఖకు ఆర్‌జేడీ కార్యాలయం ద్వారా లేఖ
- అక్రమాల రింగ్ మాస్టర్‌కు ఉన్నతాధికారుల వెన్నుదన్ను
- హెచ్ఎంలు, ఎంఇవోల నిరసన


ఆర్‌జేడీ కార్యాలయం

గుంటూరు(విద్య),నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌జేడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసి కమిషనరేట్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఇక్కడ ఆయన లేకపోతే అక్రమ వసూళ్లకు రింగ్ మాస్టర్ లేడనే ఉద్దే శ్యంతో డిప్యూటేషన్ పేరుతో ఆయనను మళ్లీ పాత స్థానంలోనే కొనసాగేలా ఆర్‌జేడీ కార్యాలయ సిబ్బంది కొంతమంది పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. దీనికి ఉన్నతాధికారుల మద్దతు పలకడంతో ఆ ద్వితీయ శ్రేణి అధికారి తీరు వివాదాస్పదం అవుతోంది. ఇటీవల ప్రభుత్వం పాఠశాల విద్యశాఖలో భారీ ఎత్తున బదిలీలు చేసింది. తొలుత డీవోలను బదిలీ చేసింది. ఆరోపణలు ఉన్న వారికి పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. ఆ తర్వాత కార్యాలయాల్లో సిబ్బందిని బదిలీ చేశారు. ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయి అక్రమాలకు దన్నుగా ఉన్నారనే ఉద్దేశ్యంతో అనేక మందిని బదిలీ చేసింది. ఇందులో భాగంగా మూడు జిల్లాలను పర్యవేక్షించే గుంటూరు ఆర్‌జేడీ కార్యాలయంలో పని చేసే ఓ ద్వితీయ శ్రేణి అధికారిని కూడా బదిలీ చేసి కమిషనరేట్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అయితే, ఇక్కడ నుంచి ఆయన వెళ్లిపోతే అక్రమ వసూళ్లకు ఆస్కారం ఉండదని, ఆదాయం పడిపోతుందనే ఉద్దేశ్యంతో ఆయన డిప్యూటేషన్‌పై కొనసాగేందుకు ఉన్నత స్థాయి అధికారులు కూడా మద్దతు పలకడం విస్మయం కలిగిస్తోంది. ఆ అధికారిని డిప్యూటేషన్‌పై ఇక్కడే నియమించడంపై హెచ్ఎంలు, ఎంఇవోలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అయినట్లు సమాచారం.

### ఆది నుంచి వివాదాస్పదమే

ఆ ద్వితీయ శ్రేణి అధికారి తీరు మొదటి నుంచి వివాదాస్పదమే. సాక్షాత్తు ఇక్కడ పనిచేసే ఉద్యోగులపై ఆయన కర్రపెత్తనం చేస్తాడని, పైసలిచ్చిన ఫైల్స్‌కు మాత్రమే క్లియరెన్స్ ఇస్తారని ప్రచారం ఉంది. ప్రైవేటు పాఠశాలల అనుమతులు వారికి జారీ చేయాల్సిన ఎన్‌వోసిల విషయంలో భారీ మొత్తంలో వసూళ్ళు చేసి కార్యాలయంలో వాటాలు రూపంలో పంపిణీ చేస్తారని ప్రచారం.

- ఎంఈవోలుగా పని చేసిన వారికి ఎఫ్ఏసీ అలవెన్స్‌ల మంజూరులో ఆయన వ్యవహరించిన తీరు తీవ్ర దుమారం రేపింది. ఎఫ్ ఏసీలుగా పని కాలానికి ఎంఈవోలకు చెల్లించాల్సిన నగదు విషయంలో ఆయన వేసిన కొర్రీలు వివాదస్పదమయ్యాయి. చివరకు ఎంఈ వోలు కోర్టులో తేల్చుకుంటామంటూ ఉన్నతాధికారులకు స్పష్టం చేయడంతో చివరకు వారికి ఎఫ్ఏసీ అలవెన్స్‌లు చెల్లించారు.
- కార్యాలయానికి వచ్చే హెచ్ఎంలను, ఎంఈవోలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. చిన్న విషయాలను కూడా భూతద్దంలో చూపి విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తాడని ఎయిడెడ్, హెచ్ఎంలు చెబుతున్నారు.
- ఈ అధికారి కార్యాలయానికి 12 గంటలకు వస్తారు. రాత్రి 9 గంటల వరకు ఉంటాడు. ఆయన ఉన్నంత వరకు మహిళా సిబ్బంది సైతం కార్యాలయంలో ఉండాలని హుకుం జారీచేస్తాడనే ఫిర్యాదులు ఉన్నాయి. ఇలాంటి అధికారికి ఇక్కడే కొనసాగేలా ఉన్నతాధికారులు మద్దతు ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది.


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ప్రొఫెసర్ పీఏస్ పాల్ కుమార్, నాతాని వెంకటేశ్వర్లు తదితరులు, పోటీలో తలపడుతున్న బాపట్ల ఇంజనీరింగ్ , బాపట్ల ఉమెన్స్ కాలేజీ జట్లు

## క్రీడలలో రాణించిన వారికి ప్రత్యేక స్థానం

### అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలను ప్రారంభించిన కోటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, నవంబరు 12 (ఆంధ్రప్రదేశ్) : ఉద్యోగ పోటీ ప్రపంచంలో క్రీడలలో రాణించిన వారికి ప్రత్యేక స్థానం ఉంటుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలను మంగళవారం స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయన ప్రారంభించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడ లలో ప్రతి విద్యార్థి తమ ప్రతిభను కనబరచాలన్నారు. ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో కూడా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని అన్నారు. తమ కళాశాలలో ప్రతి సంవత్సరం ఒక క్రీడకు ఆతిథ్యమిస్తూ విద్యార్థుల ప్రతిభ నైపుణ్యానికి తగిన శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 11 జట్లు పాల్గొన్నాయి. మొదటి రౌండ్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీపై బాపట్ల ఉమెన్స్ కాలేజీ 10 పాయింట్ల తేడాతో, మరో జట్టు వాగ్దేవి డిగ్రీ కళా శాలపై ఎంఎఎం ఫార్మసీ జట్టు నాలుగు పాయింట్ల తేడాతో గెలుపొందాయి. ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యు కేషన్ కాలేజీపై విక్టరీ డిగ్రీ కాలేజీ గెలుపొందింది. మరో మ్యాచ్‌లో ఎంఎఎం కాటేజీ జట్టుపై కృష్ణవేణి డిగ్రీ కాలేజీ జట్టు భారీ ఆధిక్యతతో లీగ్‌లో ప్రవేశించింది. కార్యక్రమంలో ఏఎన్‌యు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీఏస్ పాల్ కుమార్, కళాశాల డైరెక్టర్ కే నాసరయ్య, ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల పీడీ ఈదర ఆదిబాబు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు మబీన్

అమరావతి, నవంబరు 12: ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ విద్యార్థి పి.మబీన్ ఎంపికైనట్లు పీఈటీ అనూరాధ తెలిపారు. ఈ నెల 9,10,11 తేదీలలో యనమదలలో జరిగిన రాష్ట్ర జట్టు ఎంపికలో మబీనాను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మబీన్‌కు పాఠశాల బోధనాసిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు అభినందనలు తెలిపారు.

## సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 586.80 అడుగులు ఉంది. ఇది 304.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3849 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,78 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 45,634 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి పూర్తి స్థాయిలో నీటి ప్రవాహం నిలిచి పోయింది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

## వివాహిత ఆత్మహత్య


స్వప్న మృతదేహం

దుర్గి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పోలేపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెన్నూరి స్వప్న (32) కుటుంబ కలహాలతో మనస్తాపం చెందింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు సంతానం.

## టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నం కేసులో ఐదుగురు అరెస్టు

కొల్లిపర, నవంబరు 12 ( ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌లో టీడీపీ కార్యకర్త తూమాటి రాజేంద్రప్రసాద్‌పై మూకుమ్మడిగా దాడి చేయడంతో పాటు ట్రాక్టర్‌తో ఢీ కొట్టి హత్యాయత్నం చేయబోయిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు మంగళవారం ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌లో తూమాటి రాజేంద్రప్రసాద్‌పై వైసీపీకి చెందిన దూసరి అనిల్, దూసరి బాజీ, యద్దు కిశోర్, తూమాటి అజయ్ బాబు, పిల్లి హరీష్‌తో పాటు మరో నలుగురు ట్రాక్టర్‌తో ఢీ కొట్టి విచక్షణా రహితంగా దాడి చేశారు. బాధితుడు రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దూసరి అనిల్, దూసరి బాజీ, యద్దు కిశోర్, తూమాటి అజయ్‌బాబు, పిల్లి హరీష్‌లను తెనాలి రెండవ అదనపు సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా, వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. వీరిని నరసరావుపేట సబ్‌జైలుకు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు. మిగిలిన నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

## కష్టకాలంలో అందరూమెచ్చిన బడ్జెట్

రేపల్లెనవంబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ అందరూ మెచ్చేదిగా ఉందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక అరాచకంతో అరాచఅగాథంలో కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక రథాన్ని మళ్ళీ గాడినపెట్టి ముందుకు నడి పించేందుకు చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవులు ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలను ఆదుకునేలా జనరంజకంగా ఉందని కొనియాడారు. 8 నెలల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ముగింపు పలికి అసాధారణ పరిస్థితుల్లో చివరి నాలుగునెలలే ఉన్నా 2024-25ఆర్థికసంవత్సరం ఎన్నోగడ్డుపరిస్థితులు ఎదుర్కొంటూ కూడా రూ.2.1 లక్షల కోట్లు ఆదాయం మరో రూ.93 వేల కోట్ల అప్పుల అంచనాలతో 2.94 లక్షల కోట్లతో పద్దును రూపొందించడం ఎంతో సాహసంతో కూడిందని ప్రశంసించారు. అమరావతి, పోలవరాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు ఆశాజనంగా ఉన్నాయని అన్నారు. బలహీన వర్గాలు, దళితులు, గిరిజనులు,మైనార్టీలు,అగ్రవర్ణపేదలకు వారి జనాబా దామాషా మేరకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు జరపడం, సూపర్‌సిక్స్‌లో భాగంగా 'తల్లికి వందనం', 'మహిళలకు ఉచిత బస్సు'కు నిధులు కేటాయింపు అభినందనీయమన్నారు.


నండూరులో పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, ఎండీయూ వాహనం

## 53 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నండూరులో అక్రమంగా నిల్వ వుంచిన 53 క్వింటాళ్ల రేషన్ బియ్యంను రూరల్ పోలీసులు సోమవారం అర్థరాత్రి స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్సై గండు కిరణ్ కథనం ప్రకారం మండల పరిధిలోని నండూరులో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి చేరకుని సోదాలు నిర్వహించారు. ఓ ఇంట్లో 105 బస్తాల్లో నిల్వ ఉన్న 53 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలో నిలిపివున్న ఎండీయూ వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్వాధీనం చేసుకున్న ఎండియూను రెవెన్యూ అధికారులకు అందించారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న 11 లారీలు పట్టివేత

అమరావతి, నవంబరు 11: ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అర్థరాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 11 లారీలను సత్తెనపల్లి డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో ప్రత్యేక టీం కాపుకాసి లారీలను అదుపులోకి తీసుకుంది. తుళ్లూరు మండలం బోరుపాలెం నుండి ఇసుకను అక్రమంగా వడ్లమాను రోడ్డులో డంపింగ్ చేసి దానిని లారీల్లో లోడింగ్ చేసి గుంటూరుకు తరలిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న డీఎస్పీ తన ప్రత్యేక బృందంతో గుంటూరు రోడ్డులో కాపుకాసి అర్థరాత్రి సమయంలో ఇసుకతో వస్తున్న 11లారీలను పట్టుకుని, అమరావతి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అందులో ఒకలారీ దిడుగు నుండి ఇసుకను లోడ్ చేసుకుని వస్తుండగా సత్తెనపల్లి రోడ్డులోని ఆరుడొంకల బావివద్ద పట్టుబడింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ హెచ్చరించారు.

## తెనాలి రైల్వేస్టేషన్‌లో రూ.35 లక్షల వెండి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ ఎస్ఐ వెంకటాద్రి

తెనాలి క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని సేలం నుండి అక్రమంగా వెండిని తరలిస్తున్న వ్యక్తిని తెనాలి రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. జీఆర్‌పీ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం, సేలంకి చెందిన హరేరాం మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో శబరి ఎక్స్‌ప్రెస్‌లో 4వ నంబరు ప్లాట్‌ఫారంపై దిగివస్తుండగా సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటాద్రి అతనిని ఆపి అతని వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేశారు. అందులో 38 కిలోల బరువు కలిగిన రూ.35 లక్షల వెండి వస్తువులు లభించాయి. నిందితుడు వీటికి సంబంధించి సరైన రశీదులు చూపించకపోవడంతో అక్రమ రవాణాగా భావించి వాటిని ఇన్ కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌కి స్వాధీనం చేసి నట్లు చెప్పారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక నిఘా వ్యవస్థ కొనసాగుతుందన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బంది మూర్తి, సురేంద్ర, శ్రీనివాస్, దివ్య పాల్గొన్నారు.


రాయల్‌మెరైన్ లారీ , నుజ్జునుజ్జయిన ఆటోలో ఇరుక్కుపోయిన హరీష్ మృతదేహం

## రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

- బుద్దాం మలుపులో ఆటోను ఢీ కొట్టిన లారీ
- ఆటోడ్రైవర్ మృతి, చికిత్స పొందుతూ మరొకరు
- ఏడుగురికి తీవ్రగాయాలు


బాడిగా హరీష్ (ఫైల్‌ఫొటో)

కర్లపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మ రణం చెందిన సంఘటన కర్లపాలెం మండలంలోని బుద్దాం మలుపు దగ్గర మంగళవారం జరిగింది. కర్లపాలెం ఎస్సై రవీంద్ర కథనం ప్రకారం కర్లపాలెంకు చెందిన బాడిగ హరీష్ (29) ఆటోడ్రైవర్ .అయ్యప్పమాల దీక్షలో ఉన్నారు. కర్లపాలెం నుంచి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని చందోలు నుంచి వెళుతూ బుద్దాం దగ్గర ప్రయాణికులు దిగేందుకు ఆపాడు. వారి వద్ద డబ్బులు తీసుకుంటుండగా, చందోలు నుంచి కర్లపాలెం వైపు వస్తున్న రాయల్ మెరైన్ లారీకి ఎదురు బైక్ రావడంతో దానిని తప్పించేందుకు లారీ డ్రైవర్ సడన్ బ్రేక్.. హ్యాండ్ బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో లారీ వెనుకభాగం తగిలిన ఆటో నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఆటోలోని 8 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కర్లపాలెం పోలీసు వాహనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వం ఆసుపత్రికి తరలిస్తుండగా దేవరకొండ వెంకటేశ్ మృతి చెందాడు. ఖాజీపాలెంకు చెందిన బెజ్జం ఇందిరా, బుద్దాంకు చెందిన మద్దిబోయన శ్రీనివాసరావు, రాయగడ్‌కు చెందిన హబ్బి అకాష్, గణపవరం చెందిన దేవరకొండ గణేష్, పశ్చిమబెంగాల్‌కు చెందిన నిశి పొన్నవార్, ప్రశాంత్ పొన్నవార్, మేన కలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, సీఐ బి.హరికృష్ణ, తహసీల్దార్ సుందరమ్మ, ఎస్సై రవీంద్ర సందర్శించి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, లారీనీ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు మృతుడు .దేవరకొండ వెంకటేష్‌కు భార్య జయశ్రీ, ముగ్గురు పిల్లలు హర్ష, భరత్, ఆదిత్య ఉన్నారు.

## జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు మబీన్

అమరావతి, నవంబరు 12: ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ విద్యార్థి పి.మబీన్ ఎంపికైనట్లు పీఈటీ అనూరాధ తెలిపారు. ఈ నెల 9,10,11 తేదీలలో యనమదలలో జరిగిన రాష్ట్ర జట్టు ఎంపికలో మబీనాను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మబీన్‌కు పాఠశాల బోధనా సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 125, 134,145 |
| చికెన్ విత్ స్కిన్ | 236.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 246.00 |

## 50,805 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,507 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,805 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,674 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | | **ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 8000 | 15500 | 334 | 8000 | 16000 |
| నెంబరు. 5 | 9000 | 13000 | నెంబరు. 5 | 9500 | 12500 |
| 273 | 9000 | 12000 | 273 | 11000 | 13000 |
| 341 | 8200 | 14500 | 341 | 8500 | 15000 |
| 4884 | 9500 | 12000 | 4884 | 11700 | 14500 |
| సూపర్ 10 | - | - | సూపర్ 10 | 12000 | 12000 |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | | **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 8000 | 17000 | తేజ | 8000 | 17500 |
| బ్యాడిగి | 8000 | 14000 | బ్యాడిగి | 8500 | 13000 |
| దేవనూరు డీలక్స్ | 8500 | 14000 | దేవనూరు డీలక్స్ | 8000 | 15000 |
| తెల్లకాయలు | 5000 | 11000 | తెల్లకాయలు | 5000 | 10700 |

## మేనకోడలకు మాయమాటలు చెప్పి మేనమామ మోసం

- గర్భవతిగా నిర్ధారించిన వైద్యులు

తెనాలి మారీసుపేట,భట్టిప్రోలు (కొల్లూరు) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మేనకోడలికి మాయమాటలు చెప్పి లోబరుచుకుని గర్భవతిని చేసిన మేనమామ ఉదంతం మంగళవారం వెలుగు చూసింది. యువతి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, భట్టి ప్రోలుకు చెందిన యువతి తల్లి మృతి చెందాడు. ఆమె తండ్రి బతుకుదెరువు నిమిత్తం ఆదిలాబాద్‌కు వెళ్లాడు. పెద్దమేనమామ వద్ద ఆ యువతి ఉంటోంది. చిన్న మేనమామ తరచూ అక్కడికి వెళ్లి ఆ యువతికి మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. యువతి ఆలనాపాలనా చూస్తున్న ఆమె పిన్ని యువతిలో శారీరక మార్పులు చోటు చేసు కోవడంపై ప్రశ్నించింది. కడుపునొప్పి, నడుమునొప్పి అని చెబుతున్న ఆమెను చెరుకుపల్లి మండలం కనగాలలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లగా యువతికి పరీక్షలు చేసి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని సిఫార్సు చేశారు. అక్కడ వైద్య పరీక్షలు చేసిన వైద్యులు ఆ యువతిని గర్భవతిగా నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న యువతి చిన్నమ్మ, చినమేనమామే ఇందుకు కారణం అని పేర్కొంది. ఈ ఘటన గురించి వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించిన పోలీసులు ఈ ఉదంతం తమ పరిధి కాదని భట్టిప్రోలు పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని వైద్యులకు తెలిపారు. ఈ విషయమై భట్టిప్రోలు పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు వస్తే దర్యాప్తు చేస్తామని తెలిపారు.

# పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

## అమరలింగేశ్వరుని ఆలయ ఆదాయం రూ.1,95,525

గురజాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద బిలంలో ఉన్న శ్రీగంగాపార్వతి సమేత అమరలింగేశ్వర స్వామిని ఈనెల 4నుంచి 11వ తేదీన వరకు వచ్చిన ఆదాయాన్ని మంగళవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. మొత్తం రూ.1,95,525 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.90,700, అభిషేకం ద్వారా రూ.32,600, తలనీలాల ద్వారా రూ.1350, హుండీ ద్వారా రూ.70,875ల ఆదాయం సమకూరింది. ఈ లెక్కింపును సత్తెనపల్లి ఈవో లీలావతి పర్యవేక్షించగా దైద ఆలయ ఈవో పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

## ఎంపీని కలిసిన జనసేన నేతలు



ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో జనసేన నేతలు

మాచర్లటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలును మంగళవారం నరసరావుపేటలోని ఆయన కార్యాలయంలో జనసేన నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీని కలిసిన వారిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి.రామాంజనేయులు, మండల అధ్యక్షుడు కృష్ణబాబు, మల్లయ్య, లాల్ కృష్ణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సత్తెనపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు స్థానిక గ్రంథాలయ అధికారి కే వాణి మంగళవారం విలేకరులకు తెలిపారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు.

● దుర్గి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారులు వేణుగోపి, మెర్సీలు తెలిపారు.

## ఎమ్మెల్సీ ఓట్ల దరఖాస్తులపై సమీక్ష

సత్తెనపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకై వచ్చిన దరఖాస్తులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? అనే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చక్రవర్తి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ముప్పాళ్ళలో ఆర్డీవో పరిశీలన

ముప్పాళ్ళ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ తహసీల్దార్ కార్యాలయాన్ని సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం భవానీశంకర్‌ను ఎమ్మెల్సీ ఎన్నికల దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 20వ తేదీ లోపు డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసాదు, సిబ్బంది ఉన్నారు.

## రేపు పాండురంగస్వామి కల్యాణం

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయంలో స్వామి 74వ వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈనెల 11నుంచి 17వ తేదీ వరకు జరుగుతున్నాయి. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివార్లను పెండ్లికుమారుడిగా చేశారు. 14వ తేదీ రాత్రి పది గంటలకు స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పరాశరం రామకృష్ణమాచార్యులు తెలిపారు.

## 1000 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

వెల్దుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిచ్చయ్యబావి తండాలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపారు. గ్రామంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 1000 లీటర్ల బెల్లంపు ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా విక్రయించినా, తయారు చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న కారు

● నలుగురు కూలీలకు గాయాలు

గురజాలటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కారు ఆటోను ఢీకొన్న ఘటన పట్టణ శివారులోని వాగ్దేవి కళాశాల వద్ద మంగళవారం రాత్రి జరిగింది. కలెక్టర్ కార్యాలయంలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శెనగల శివనాగిరెడ్డి తన కారులో గురజాలకు వస్తున్నారు. వాగ్దేవి కళాశాల సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. శివనాగిరెడ్డి నిర్లక్ష్యంగా కారు నడపడం వల్లనే గాయాలయ్యాయని కూలీలు ఆరోపిస్తున్నారు.

## యువకుడి అదృశ్యంపై గాలింపు చర్యలు ముమ్మరం

రెంటచింతల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన కొత్త అఖిల్ అదృశ్యంపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో పాటు సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటం పాదరక్షలతో పాటు మొబైల్ ఫోన్ బుగ్గవాగు రిజర్వాయర్ ఒడ్డున లభ్యం కావడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన అధికమైంది. మంగళవారం వేకువ జాము నుంచే రిజర్వాయర్‌లోకి మత్స్యకారులను రంగంలోకి దించారు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో గాలింపునకు అడ్డంకులు ఎదురౌతున్నాయి. ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి ఇరిగేషన్ డీఈ లింగమూర్తితో, ఏఈ శివతో ఫోన్‌లో మాట్లాడారు. బుగ్గవాగు వద్ద కొనసాగుతున్న గాలింపు నెలకొన్న పరిస్థితులపై ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నారు.

## చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

గురజాలటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో గౌసియాబేగం సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## ఆయుర్వేద వైద్యశాలలకు సుస్తి

● జూలకల్లు, పెద మక్కెన, నకరికల్లు ఆయుర్వేద వైద్యశాలల మూసివేత
● సిబ్బంది కొరత కారణంగా చెబుతున్న అధికారులు
● ఆయుర్వేద వైద్యానికి దూరమవుతున్న ప్రజలు



నకరికల్లులో మూత పడిన ఆయుర్వేద వైద్యశాల

నకరికల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైద్యశాస్త్రంలో ఆయుర్వేద వైద్యానికి ప్రత్యేక స్థానం ఉంది. దీర్ఘకాలిక వ్యాధులు ఆయుర్వేద వైద్యం లోనే నయమవు తాయనేది ఎక్కువ మంది అభిప్రాయం. అంతేగాక ఆయుర్వేద మందుల వల్ల ఇతర అవయవాల మీద చెడు ప్రభా వం చూపదని విశ్వసిస్తారు. అందులో భాగంగానే ఎక్కువ మంది ఆయుర్వేద వైద్యాన్ని తమ ఆరోగ్య అవసరాలకు వినియోగించుకుంటారు. పల్నాడు జిల్లాలో 15 ఆయుర్వేద వైద్యశాలలు ఉండగా సిబ్బంది కొరత కారణంగా నకరికల్లు, జూలకల్లు, పెద మక్కెన వైద్యశాలలు మూతపడ్డాయి. ఈ కారణంగా ప్రజలు ఆయుర్వేద వైద్యానికి దూరమవుతున్నారు.

### ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా ములకలూరు, అమరావతి, నరుకుళ్ళపాడు, ముప్పాళ్ళ, బెల్లంకొండ, గణపవరం, కోట నెమలిపురి ఆయుర్వేద ఆరోగ్య కేంద్రాలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లోకి చేర్చారు. ఈ ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయి సిబ్బందితో పాటు ఆధునిక ఆయుర్వేద వైద్య విధానాలను అందు బాటులోకి తెచ్చారు. పూర్తి స్థాయిలో డాక్టర్, కాంపౌండర్, ఏఎన్ఎం, నాలుగో తరగతి ఉద్యోగి ఒకరు, యోగా ఇన్‌స్ట్రక్టర్లను స్త్రీ పురుషులకు విడివిగా నియ మించారు. ఉన్న చోట పూర్తి స్థాయి ఆయుర్వేద వైద్య సదుపాయలు అందుబాటులో ఉన్నాయి. మూతపడి న ఆయుర్వేద ప్రభుత్వ ఆస్పతుల్లో వైద్యసేవలు పూర్తిగా నిలిచిపోయాయి. సిబ్బంది కొరత కారణంగా కొన్ని చోట్ల- భవనాలు శిథిలావస్థకు చేరటంతో మరికొన్ని చోట్ల- ఆక్రమణలకు గురి కావటంతో ఇం కొన్ని చోట్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మూతపడిన ఆయుర్వేద వైద్యశాలలను తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

### ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

● జీ పద్మజాతి, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్

ఆయుర్వేద వైద్యశాలలు మూతపడిన విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రయత్నం చేసినా అవకాశం లేని పరిస్థితి ఉంది. ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకొనేందుకు సిద్ధంగా ఉన్నాం.

## ఈసీ వద్దన్నా.. ఆ రెండు ఇవ్వండి !

● పల్నాడులో ఎమ్మెల్సీ ఓటుకు టెన్త్, ఇంటర్ సర్టిఫికెట్లు అడుగుతున్న బీఎల్‌వోలు

పిడుగురాళ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఓటుకై భారీగా దరఖాస్తులు నమోదయ్యాయి. మొదట్లో ఓటు నమోదుకు సర్టిఫికెట్ల విషయంలో కొంత సందిగ్ధత ఏర్పడి సంబంధిత అధికారుల్లో అయోమయం నెలకొంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో దాఖలైన ఫారం-18 పత్రాలు సంబంధిత బీఎల్‌వోలకు చేరిన తరువాత వెరిఫికేషన్ పేరుతో పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ కొందరు బీఎల్‌వోలుగా ఉంటున్న అధికారులు ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న పట్టభద్రులకు ఫోన్లు చేసి టెన్త్, ఇంటర్ సర్టిఫికెట్లు తీసుకొని పరిశీలన నిమిత్తం కార్యాలయానికి రావాలని చెబుతున్నారు. గత వారమే ఎన్నికల సీఈవో వివేక్‌యాదవ్ ఎమ్మెల్సీ ఓటుపై స్పష్టత ఇచ్చారు. 2006లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన జీవో ఎంఎస్ నెం.536లో ఏ విశ్వవిద్యాలయానికి సంబంధించిన డిగ్రీలను అర్హతగా పరిగణించవచ్చు అని స్పష్టత ఇచ్చారని సంబంధిత అధికారులు ఆ జీవోను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. గురజాల నియోజకవర్గం పరిధిలో అర్బన్, రూరల్‌లో సుమారు 6.50 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం, ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ప్రింట్ తీసి విచారణ నిమిత్తం బీఎల్‌వోలకు అందజేస్తున్నారు. వాటిని పట్టభద్రుల ఇంటి వద్దకు వెళ్లి విచారించకుండా కార్యాలయాల వద్దకు రావాలని ఫోన్ చేసి పిలిపిస్తున్నారు.

### కొందరు రెండు నుంచి ఐదు దరఖాస్తులు

పట్టభద్రుల ఓటు నమోదులో అధికారులకు వింత సమస్య కనిపించింది. పిడుగురాళ్ల పట్టణంలో కొందరు పట్టభద్రులు ఒక్కొక్కరు 2 నుంచి 8 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో నమోదు చేసుకున్నారు. కొందరైతే 2 నుంచి 5 వరకు, మరికొందరైతే వివిధ వార్డుల నుంచి ఆరేడు వరకు దరఖాస్తులు అందజేశారు. గత రెండు రోజులుగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన, బీఎల్‌వోలకు చేరవేయడంలో డబుల్ ఎంట్రీలు బయటపడుతున్నాయి. పిడుగురాళ్ల పట్టణంలోనే సుమారు 400వరకు డబుల్ ఎంట్రీలు నమోదయ్యాయి.

## ఎరువుల దుకాణంలో తనిఖీ



ఆకులగణపవరంలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏవో

రాజుపాలెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులగణపవరంలో ధూళిపాళ్ల ఆంధ్రబ్యాంకు సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎరువుల దుకాణంను మంగళవారం స్థానిక ఏవో వెంకటనరసయ్యతో కలిసి క్రోసూరు ఏడీఏ హనుమంతురావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హనుమంతురావు స్టాక్ రిజిస్టర్, భౌతిక నిల్వలకు బోర్డుపై ఉన్న నిల్వలను పరిశీలించారు. ఈ పాస్ మిషన్లో స్టాక్‌ను, రిజిస్టర్‌లో ఉన్న స్టాక్‌లను పోల్చిచూశారు. తొలుత మండలంలోని బలిజేపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ హనుమంతురావు రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు ఉన్నారు.

## సర్పంచుల సమావేశం

పిడుగురాళ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామచంద్రరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటిని కలుషితం లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందన్నారు. కార్యాలయ ఏవో నాగచంద్రకుమారి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్‌డీ బి.దయాసాగర్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పుల్లారావు



కారంపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కారంపూడి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కె.పుల్లారావు నియమితులయ్యారు. ఆయన నకరికల్లు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కారంపూడి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ప్రసాద్ గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందారు.


## వృత్తివిద్యలో నైపుణ్యంపై అవగాహన

అచ్చంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల 9వ తరగతి విద్యార్థులకు వృత్తి విద్యలో నైపుణ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురుకుల పాఠశాల ఒకేషనల్ టీచర్ కట్టా శివన్నారాయణ 9వ తరగతి, ఇంటర్ విద్యార్థులు అచ్చంపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ జయభారతి బ్యాంకింగ్, డిజిటల్ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## భాష్యం ఆంజనేయులుకు టీడీపీ జీవితకాల సభ్యత్వం

పెదకూరపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జీవితకాల సభ్యత్వాన్ని పెదకూరపాడుకు చెందిన తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ భాష్యం ఆంజనేయులు లక్ష రూపాయలు చెల్లించి పొందినట్టు మంగళవారం తెలిపారు.

## వైభవంగా కోటి దీపోత్సవం



కోటి దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

పిడుగురాళ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పౌర్ణమి గడియలను పురస్కరించుకొని బ్రాహ్మణపల్లి శివాలయంలో మంగళవారం రాత్రి కోటి దీపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మహిళలు, స్వాములు, దీపోత్సవంలో అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## కూలీల సంఖ్య పెంచండి

● ఒక్కొక్క గ్రామం నుంచి 100 మంది వచ్చేలా చూడాలి
● పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టండి
● స్థానిక సిబ్బందిని ఆదేశించిన డ్వామా పీడీ



కొత్తపాలెంలో మంజూరైన రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ తదితరులు

మాచవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి పనులు చేసేందుకు కూలీల సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఒక్కొక్క గ్రామం నుంచి రోజుకు వంద మంది కూలీలు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి స్థానిక అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని సింగరాయపాలెం తండా, మోర్జంపాడు, కొత్తపాలెం గ్రామాల్లో జరుగుతున్న మినీ గోకులాలు, సీసీ డ్రెయిన్‌లు, సీసీ రోడ్లు, ఫారం పాండ్స్, హార్టికల్చరల్ పనులను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలు తెలియజేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశంలో మాట్లాడుతూ కూలీల సంఖ్య ఎంత ఎక్కువగా పెంచితే అంత మంచిదని, దీనివల్ల మెటీరియల్ పనులకు సంబంధించి నిధులు ఎక్కువగా మంజూరు కావటానికి అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల మంజూరైన సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్‌లు, మినీ గోకులాల నిర్మాణాల ను కూడా వెంటనే ప్రారంభించి పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనుల వివరాలను పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు పీడీకి వివరించారు. ప్రస్తుతం మండలంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీడీ మల్లికార్జున, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈ నాగేశ్వరరావు, కొత్తపాలెం సర్పంచ్ యామని రామారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

### రైతులకు ఉపయోగపడే పనులు చేయాలి

పిడుగురాళ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే ప్రతి పని రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలని పీడీ సిద్ద లింగమూర్తి తెలిపారు. మంగళవారం పాతగణేశునిపాడు గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీల వివరాలు, వారికి అందుతున్న నగదు వివరాలను అడిగి తెలుసుకొని ఉపాధి పథకం ద్వారా చేపట్టే ప్రతిపని రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేలా చూడాలన్నారు.

## నిరుద్యోగ సమస్యను రూపు మాపేందుకు కృషి

● జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు




ఉద్యోగాలు సాధించిన వారితో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు

సత్తెనపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను రూపు మాపేందుకు కృషి చేస్తుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళాను నిర్వహించారు. జాబ్ మేళాకు 54 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. అందులో 30మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం రవీంద్రనాయక్, కో-ఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి, మహిధర్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పల సద్దికి టీటీడీ బోర్డు సభ్యుడు జంగా



అంకమ్మతల్లి ఆలయంలో సద్ది కార్యక్రమానికి హాజరైన జంగా కృష్ణమూర్తి తదితరులు

దాచేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని వీర్లంకమ్మ తల్లి దేవాలయంలో 20 రోజులుగా జరుగుతున్న అయ్యప్పస్వామి పడిపూజ, సద్ది కార్యక్రమానికి టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంగళవారం ఆలయంలో నిర్వహించిన అయ్యప్పస్వామి పూజా కార్యక్రమంలో జంగాతో పాటు జనసేన నేతలు పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యలమల నరేష్ స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

### కార్తీక వన సమారాధనకు జంగాకు ఆహ్వానం

మాచర్లటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న యాదవ సంఘ కార్తీక వనసమారాధనకు జంగా కృష్ణమూర్తిని యాదవ సంఘ నేతలు ఆహ్వానం అందించారు. దాచేపల్లి మండలం గామాలపాడులోని జంగా గృహంలో ఆయన్ను కలుసుకొని వన సమారాధనలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వీరాస్వామి యాదవ్, ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు (జీవీ), జింకల నాగేశ్వర యాదవ్, మున్నా రాంబాబు, గోళ్ల సురేష్ యాదవ్, వీర్ల కొండలరావు, యార్లగడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి : ఎంపీడీవో

మాచవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అక్కడక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ఆయా గ్రామాల సచివాలయ సిబ్బందిపై ఉందని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బేటీ బచావో బేటీ పఢావో అనే కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పిడుగురాళ్ళ సీడీపీవో రుక్సానా సుల్తానా బేగం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు బాల్య వివాహాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు.

● వెల్దుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులు బేటీ బచావో బేటీ పఢావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన బుక్‌లెట్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గ, శైలజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పత్తిని అమ్మాలంటే రైతుసేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలి

దాచేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన పంటను సీసీఐ కేంద్రాల్లో విక్రయించాలనుకుంటే ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని ఏవో దొండేటి పాపకుమారి మంగళవారం తెలిపారు. పత్తి క్వింటా ధర 7,521 రూపాయల వరకు ఉందని వివరించారు.

## మద్యం వ్యాపారులందరికీ పర్మినెంట్ లైసెన్స్‌లు ఇచ్చేశాం

● ఎక్సైజ్ సీఐ టీ తులసీ

ఫటా ఫట్



క్రోసూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న మూడు మండలాల్లో పది మద్యం షాపులకు పర్మినెంట్ లైసెన్స్‌లు జారీ చేశామని ఎక్సైజ్ సీఐ టీ తులసీ తెలిపారు. ఆమెతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఫటాఫట్..

**ప్ర: మద్యం వ్యాపారులందరికీ పర్మినెంట్ లైసెన్స్‌లు ఇచ్చేశారా?**

జ: మొత్తం పది షాపులకు పర్మినెంట్ లైసెన్స్‌లు జారీ చేశాం, బ్యాంకు గ్యారెంటీలు కూడా తీసుకున్నాం. షాపుల ఏర్పాటు విషయంలో ఎటువంటి వివాదాలకు, ఒత్తిడులకు తావు లేదు.

**ప్ర: పర్మిట్ రూంలు ఏమైనా అనుమతించారా?**

జ: వాస్తవంగా వాటిని ప్రీమియం స్టోర్స్ అంటారు. వాటికి అనుమతుల గురించి ఇంతవరకు ఎటువంటి ఆదేశాలు లేవు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తాం.

**ప్ర: ఎన్‌డీపీఎల్ మద్యం సరఫరా మాటేమిటి?**

జ: క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్‌కు కొంత భాగం కృష్ణా తీరం వెంబడి తెలంగాణా బోర్డర్ ఉంది. ఎట్టి పరిస్థితుల్లో ఎన్‌డీపీఎల్ మద్యాన్ని అనుమతించే ప్రసక్తే లేదు. పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశాం.

**ప్ర: కుటీర పరిశ్రమగా నాటు సారా తయారీ ఉందంటున్నారు?**

జ: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో కొంత అటవీ ప్రాంతం ఉంది. నాటు సారా తయారీ, విక్రయదారులపై నిఘా ఏర్పాటు చేశాం, ఎక్కడైనా నాటు సారా ఆచూకీ దొరికితే కేసులు నమోదు చేసి జరిమానాలు విధించటంతో పాటు బైండోవర్ చేస్తున్నాం.

**ప్ర: బెల్టు షాపుల నిర్వహణను అదుపు చేయగలుగుతారా?**

జ: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్టు షాపుల నిర్వాహణ ప్రసక్తే లేదు. ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరిగినట్లు తెలిస్తే వెంటనే వారిని అరెస్టు చేసి లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తాం. హెచ్చరికలు పాటించకపోతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం.

## వర్షపు నీటితో నిండిన అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి

సమస్య ఇది.. స్పందించరూ



రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద చేరిన వర్షపునీరు

దాచేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ, నడి కూడి గ్రామ సమీపంలోని నడికూడి - గోగులపాడు గ్రామాల మధ్య రహదారి మార్గంలో నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద వర్షపునీరు చేరి ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ మార్గం గుండా నడిచే నడికూడి, బూదవాడ, గోగులపాడు, అలుగు మల్లపాడు, తక్కెళ్లపాడు గ్రామాల ప్రజలు మాట్లాడుతూ వర్షం కురిసిన ప్రతిసారి రైల్వే అండర్ పాస్ (భూగర్భ మార్గం) కింద వర్షపునీరు చేరుతుందని తెలిపారు. వాన తగ్గిన 10 రోజుల తరువాత కూడా బ్రిడ్జి కింద చేరిన నీరు నిల్వ ఉండి వాహన చోదకులకు, పాదచారులకు ఇబ్బందికరంగా ఉంటోంది. అధికారులు ప్రజల ఇబ్బందులను గుర్తించి నీరు నిల్వలేకుండా చూడాలని కోరుతున్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాలకు వరమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం అమరావతి మండలానికి చెందిన ఎనిమిది మందికి రూ4,64,937 విలువ చేసే సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం వారికి భరోసాగా నిలుస్తుందన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా సాయం పొందిన వారు తమ కుటుంబసభ్యులతో కలసి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## ముస్లిం మైనార్టీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

● పల్నాడు జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షుడు అమీర్ ఆలీ

మాచవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారంటే అది టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమైందని పల్నాడు జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షుడు అమీర్ ఆలీ తెలిపారు. మంగళవారం మండలంలోని తురకపాలెంలో ఏర్పాటు చేసిన ముస్లిం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమం కోసం రూ.4,376 కోట్లు కేటాయించినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు ముస్లిం మైనార్టీల సంఘం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు, యరపతినేనిల కోసం ప్రత్యేక దువా నిర్వహించారు. అనంతరం మదర్సా పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, తెలుగు యువత మండల అధ్యక్షుడు హసన్ ఆలీ, మాజీ సర్పంచ్ మాబువలి, సయ్యద్ అబ్దుల్ రహీం, సైదావలి, మసీదు కమిటీ సభ్యులు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చిన ఘనత చంద్రబాబునాయుడుదే

● టీడీపీ సీనియర్ నాయకుడు కంచేటి సాయిబాబు

బెల్లంకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేనని టీడీపీ సీనియర్ నాయకుడు కంచేటి సాయిబాబు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం బెల్లంకొండలో ఒక కార్యక్రమానికి హాజరై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో మైనార్టీ సెల్ ప్రధాన రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు పీఎస్‌కే రసూల్, రహీం, అక్కల వెంకట రామిరెడ్డి, సర్పంచ్ జ్యోతి సముద్రం, వైస్ సర్పంచ్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

● తాలూకా యూనిట్ ఏపీజీఈఏ నాయకుల డిమాండ్

క్రోసూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్రోసూరు యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు శిఖా శ్యామ్‌సన్, బండి రత్తయ్య మంగళవారం క్రోసూరులో డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సంబంధించిన 12వ పీఆర్‌సీ కమిషనర్‌ను వెంటనే నియమించాలని, ఆర్థిక, ఆర్థికేతర అంశాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య ఉద్యోగుల సర్దుబాటుకు సంబంధించిన జీవో నెంబరు 143, జీవో నెంబరు 32లను సవరించి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. నిరుపయోగంగా ఉన్న ఈహెచ్ఎస్ హెల్త్ కార్డుల విషయంలో వెంటనే నిర్ణయం తీసుకొని క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ ప్రతి ఉద్యోగికి, పెన్షనర్లకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట పలువురు ఉద్యోగ సంఘాల నాయకులున్నారు.

## మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం సరఫరా చేయాలి

● తహసీల్దార్‌ను కోరిన ఉపాధ్యాయులు

దాచేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యాన్ని అందజేయాలని దాచేపల్లి మండలంలోని ఉపాధ్యాయులు తహసీల్దార్ వైవీ కుటుంబరావును కలిసి విన్నవించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుతం సరఫరా చేస్తున్న బియ్యం లావుగా ఉండటం వల్ల కొద్దిగా ఎక్కువ ఉడికితే మెత్తబడటం, తక్కువ ఉడికితే బిరుసుగా ఉంటుందని తెలిపారు. ఇటువంటి ఆహారంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తహసీల్దార్‌కు విన్నవించిన వారిలో దాచేపల్లి-1, 2 ఎంఈవోలు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.



# ..రయ్‌రయ్

(5వ పేజీ తరువాయి)

పురుషోత్తమపట్నం, చిలకలూరిపేట, గణపవరం, నాదెండ్ల వద్ద అండర్ పాస్‌ల నిర్మాణం చేశారు. బొప్పూడి, కోటప్పకొండ, గణపవరం, నాదెండ్ల ప్రాంతాల్లో 8 బస్ షెల్టర్లు నిర్మించారు. రోడ్డుకు ఒకవైపున ప్రధాన సర్వీస్ రోడ్డు ఉంటుంది. అండర్ పాస్‌ల వద్ద రెండు వైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్లు 15 సంవత్సరాల పాటు ఈ రోడ్డు నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. బైపాస్ రోడ్డుకు రెండు వైపులా 16 కిలోమీటర్ల పొడవునా శాశ్వత గోడ నిర్మాణం చేశారు. పశువులు రోడ్డుపైకి రాకుండా ఉండడానికి, ఆక్రమణలను అరికట్టడానికి, ప్రమాదాల నివారణకు ఈ గోడను నిర్మించారు. రోడ్డు పక్కన గణపవరం వద్ద హైవేస్‌కు చెందిన విశాలమైన ప్రదేశం రెండు చోట్ల ఉంది. దీంతో దానిని సద్వినియోగం చేసుకునేందుకు ఒక మెగా వాట్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సోలార్ ప్లేట్లను బిగిస్తున్నారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పగటి వేళలో గ్రిడ్‌కు అనుసంధానం చేసి, రాత్రిళ్లు రోడ్డుపై లైట్ల వెలుగులకు వినియోగించనున్నారు. బైపాస్ రోడ్డు పొడవునా ఒకవైపున 3,500 మొక్కలను నాటుతున్నారు. వాటిలో గానుగ, వేప, నల్లమద్ది, గుల్మోరా, పెంట్ పామ్ జాతుల మొక్కలు ఉన్నాయి. ప్రతి మొక్కకు ట్రీ గార్డును ఏర్పాటు చేస్తున్నారు. వీటికి నిత్యం నీటిని అందించి సంరక్షించేందుకు రెండు చోట్ల బోరు పాయింట్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లపై కాగితం పూల మొక్కలను నాటారు.

### నాణ్యతా ప్రమాణాల తనిఖీలు

రోడ్డు నిర్మాణం పనులు పూర్తయినట్లుగా బీఎస్‌సీపీఎల్ కంపెనీ కాంట్రాక్టర్లు నేషనల్ హైవే సంస్థకు నివేదించారు. దీంతో హైవేస్ అధికారులు పనుల నాణ్యతా ప్రమాణాల పరిశీలన చేస్తున్నారు. పరిశీలన అనంతరం రోడ్డు ప్రారంభోత్సవానికి పచ్చజెండా ఊపుతారు. ఇప్పటికే నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం ఆధ్వర్యంలో రోడ్డు తనిఖీ జరిగింది. బైపాస్ రోడ్డులో అత్యంత ఆధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ కెమెరాల ఏర్పాటు జరిగింది. వాహనాల వేగంపై కన్నేసి ఉంచేందుకు ప్రత్యేక పరికరాలు బిగించారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారం గుంటూరు విజయవాడ మధ్య ఉన్న కాజ టోల్‌గేట్ వద్దకు చేరే విధంగా ఏర్పాటు జరిగింది.

### టోల్‌గేట్‌లేని మార్గంగా బైపాస్

చిలకలూరిపేట వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయినా ఈ మార్గంలో టోల్‌గేట్ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన వ్యయాన్ని రాబట్టుకోవడానికి గుంటూరు విజయవాడ మధ్య ఉన్న కాజ టోల్‌గేట్ వద్ద రేట్లను పెంచవచ్చని సమాచారం.

### చిలకలూరిపేట ప్రజలకు తప్పనున్న తిప్పలు

బైపాస్ రోడ్డుపై అధికారికంగా రాకపోకలకు అనుమతిస్తే చిలకలూరిపేట ప్రజలకు ఊరట లభిస్తుంది. ప్రస్తుతం పట్టణం మధ్యగా వెళ్లే జాతీయ రహదారిపై మూడు ప్రధాన సెంటర్లలో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నది. దీనివల్ల ఒంగోలు గుంటూరు మధ్య ప్రయాణం చేసే వారికి సుమారు 30 నిమిషాల సమయం వృథా అవుతున్నది. పట్టణ ప్రజలు రోడ్డు దాటి వెళ్లాలంటే కనీసం 20 నిమిషాల సమయం పడుతున్నది. దీనికి తోడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. బైపాస్ రోడ్డును ప్రారంభిస్తే అధిక శాతం వాహనాలు ఆ మార్గంలో వెళ్తాయి కాబట్టి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి. కాలుష్యం సమస్యకు కూడా తెరపడుతుంది.

భారత్-ఈ జట్టులో

## అఖిల పావనికి స్థానం




మంగళగిరి సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికిచెందిన మహిళా క్రికెటర్ కడియం వాసవి అఖిల పావని భారత్- ఈ మహిళల జట్టులో స్థానం సంపాదించింది. బీసీసీఐ ఆధ్వర్యంలో గత నెల 17 నుంచి వివిధ వేదికలపై సీనియర్ మహిళా టీ-20 టోర్నీ జరిగింది. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన 75 మందిని బీసీసీఐ ఎంపిక చేసింది. వీరిని ఏ, బీ, సీ, డీ, ఈ జట్లుగా విభజించింది. ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీ వేదికగా ఈ నెల 17 నుంచి జరుగనున్న చాలెంజర్స్ ట్రోఫీలో ఈ జట్లు తలపడ తాయి. బీసీసీఐ సీనియర్ మహిళా టీ-20లో వాసవి అఖిల పావని ఆంధ్రా జట్టు తరఫున ఆడి మొదటి స్థానం, దక్షిణ భారత దేశంలో రెండవ స్థానం, జాతీయస్థాయిలో 15వ స్థానంలో నిలిచి చాలెంజర్స్ ట్రోఫీలో ఇండియా-ఈ జట్టుకు ఎంపికైంది. చాలెంజర్స్ ట్రోఫీలో మంచి ప్రతిభ కనబరిస్తే నేరుగా భారత మహిళల జట్టు లేదా మహిళల ఐపీఎల్ జట్లకు ఎంపికయ్యే అవకాశం ఉంది. పావనికి పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.



పరీక్షలను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ ఆచార్య ఎం సుబ్బారావు

## బీఈడీ పరీక్షలు ప్రారంభం

పెదకాకాని, నవంబర్ 12( ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయని పీజీ పరీక్షల తాత్కాలిక కో-ఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. వర్సిటీ ఎదురుగా ఉన్న ప్రభల డిగ్రీ కళాశాలలో హైకోర్టు ఆదేశాలతో ఆరు కళాశాలలకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.




శరీరాన్ని అలవోకగా మెలికలు తిప్పగలదు. అతిక్లిష్టమైన యోగాసనాలను సైతం అత్యంత సులువుగా వేయగలదు. కేవలం ఆసనాలు వేయడమే కాదు.. కూచిపూడి నృత్యంలోనూ ప్రవేశం ఉంది. విభిన్నరంగాల్లో తన ప్రతిభను కనబరుస్తూ ప్రశంసలు పొందుతున్న పదిహేనేళ్ల బాలిక పేరు స్నిగ్ధ. బాపట్ల వాసి అయిన స్నిగ్ధ పలు వేదికలపై తన ఘనతను చాటుతోంది.

### ఎస్‌జీఎఫ్‌ఐలో పాల్గొనాలి : స్నిగ్ధ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటడంతో పాటు యోగాలో ఎంఎస్‌ఈ డిగ్రీ అందుకోవాలనేది నా కోరిక. అందుకు అనుగుణంగానే కష్టపడుతున్నాను. మైసూర్ నేషనల్స్ కాంపిటీషన్‌లో సెకండ్ ప్రైజ్ దక్కించుకున్నాను. ఆల్‌ఓవర్ సెంట్రల్ స్కూల్ స్టేట్ కాంపిటీషన్‌తో పాటు నేషనల్ ఒలింపియాడ్ పోటీల్లో సెకండ్ ప్రైజ్ గెలుచుకున్నాను. డిస్ట్రిక్ట్ యోగా కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతితో పాటు శాప్ పోటీల్లో తొలి బహుమతి దక్కించుకు న్నాను. రీజినల్ నేషనల్స్‌లో 3 సార్లు పాల్గొంటే ఒకసారి సిల్వర్, రెండు సార్లు గోల్డ్ మెడల్ గెలుచుకున్నాను. నేషనల్ స్టాండ్‌బైలో థర్డ్‌ప్రైజ్ వచ్చింది. ఇవన్నీ కూడా బెంగుళూరు, మైసూర్, హైదరాబాద్ వేదికగా జరిగిన పోటీలే కావడంతో కేంద్రీయ విద్యాలయం టీచర్ల దగ్గర నుంచి కూడా నాకు పూర్తిగా సపోర్ట్ ఉండేది. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న ప్రిన్సిపల్ మేడం అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారు.



నేషనల్ కాంపిటీషన్లో గెలుచుకున్న మెడల్‌తో స్నిగ్ధ

కూచిపూడి నాట్యంతో అలరిస్తున్న స్నిగ్ధ

# యోగ స్నిగ్ధ ముద్ర



- అలవోకగా ఆసనాలు.
- కూచిపూడి నృత్యంలోనూ ప్రవేశం
- ప్రతిభ చాటుతున్న విద్యార్థి స్నిగ్ధ

### గురువు శిక్షణ.. అమ్మానాన్నల పోత్సాహం

చిన్నప్పటి నుంచి గురువు ఖాదర్‌వలీ శిక్షణకు తోడు అమ్మానాన్నలు మాధురి, వెంకట కృష్ణప్రసాద్ ఇచ్చిన ప్రోత్సాహమే తనను యోగావైపు అడుగులేసేలా చేసింది. ఎక్కడ పోటీలు జరిగినా అమ్మే తోడుగా వచ్చేది. చదువును, యోగాను ఈ రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవడంలో అమ్మ గైడెన్స్, నాన్న ఇచ్చే ధైర్యం ఎంతగానో ఉపయోగపడు తోంది. కూచిపూడి నృత్యం నేర్చుకున్నా. క్లాసికల్ డ్యాన్స్‌లో కూచిపూడి నృత్యం కూడా నేర్చుకుని ప్రదర్శనలిచ్చాను. కోర్సు పూర్తి చేసి నాంపల్లి పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ అందుకున్నాను.

బాపట్ల, నవంబరు 12( ఆంధ్రజ్యోతి) : మూడో తరగతి నుంచే యోగాపై ఆసక్తి కనబరిచిన బాలిక స్నిగ్ధ ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. యోగాలో తాను సాధించిన విజయాలతో పాటు ఎన్నో విషయాలను ఆ చిన్నారి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకుంది. ఆ వివరాలు స్నిగ్ధ మాటల్లోనే..

నేను కేంద్రీయ విద్యాలయంలో మూడో తరగతి చదువుతున్నప్పుడే సీనియర్లు యోగా చేయడం చూశాను. అప్పటి నుంచే ఆసక్తి మొదలైంది. క్రమేపీ యోగాపై మరింత శ్రద్ధ పెరిగింది. అలవోకగా ఆసనాలు వేయడం చూసిన ఖాదర్ వలీ మాస్టారు నాకు శిక్షణ ఇచ్చారు. మరింతగా ప్రోత్సహించారు. నేను మూడో తరగతిలో ఉన్నప్పుడు నుంచి నాకు ఆయనే యోగా గురువు. ఆసక్తి ఉన్న వారికి ఉచితంగానే మాస్టారు యోగా నేర్పించేవారు. సమయపాలనలో కఠినంగా ఉండేవారు. ఇప్పటికీ మాస్టారు ఆసనాలు వేసి నేర్పిస్తుంటారు.

### ఆటలకు దూరమే..

మూడో తరగతి నుంచే ఆటలపై ఆసక్తి అంతగా ఉండేది కాదు. తోటి విద్యారులందరూ ఆటల కోసం గ్రౌండ్‌కు వెళితే నేను మాత్రం సాయింత్రం 5 గంటలు కాగానే మేట్ బ్యాగ్ తగిలించుకుని యోగా తరగతులకు వెళుతుండేదానిని. కొన్ని ఆసనాలు నేర్చుకోవడంలో బాగా ఇబ్బంది పడేదాన్ని. ఓ ఆసనం విషయంలో ఓ కాలు ముందుకు చాపి, మరో కాలును వెనకి నుంచి చెవి దగ్గర తాకించాల్సి ఉంటుంది. అది నేర్చుకునే క్రమంలో నొప్పి భరించలేక ఏడ్చేశాను. యోగాపై ఉన్న ఇష్టం ముందు ఆ బాధ ఏమంత పెద్దగా అనిపించలేదు. అమ్మ మాత్రం నేను పడుతున్న కష్టం చూసి ఓ వారం పాటు నాతో శిక్షణ కేంద్రానికి రావడం మానేసింది. అయితే, నా ఇష్టాన్ని అర్థం చేసుకున్న అమ్మానాన్నలు తోడుగా నిలబడ్డారు.

నేను యోగా నేర్చుకోవడం మొదలుపెట్టినప్పుడు దీనిపై ఆసక్తి చాలా తక్కువ మందికి ఉండేది. కానీ, ఇప్పుడు అందరూ దీనిపై దృష్టిపెడుతున్నారు. ఆరోగ్య రీత్యా ఆసక్తి కనబరుస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా యోగా ప్రాచుర్యం పొందడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. యోగాను క్రీడగా గుర్తించడం వల్ల కూడా భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటాలో అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఇది ఉపయోగడనుంది. ఇష్టంతో నేర్చుకున్న యోగ ఇప్పుడు ఎన్నో అవకాశాలకు వేదికగా నిలవడంతో పాటు రాబోయే రోజుల్లో కూడా ప్రాధాన్యం దక్కుతుందనిపిస్తోంది.



బాపట్ల కేంద్రీయ విద్యాలయంలో జరిగిన పోటీల్లో జడ్జీలతో చిన్నారి స్నిగ్ధ (ఫైల్)

# ఏపీలో జపాన్ విద్యా విధానం



జపాన్ బృందానికి మెమెంటో అందజేస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య రామ్మోహన్‌రావు, వీసీ ఆచార్య గంగాధరరావు

- టోయామా యూనివర్సిటీతో ఒప్పందం
- విద్య, అధ్యాపక, పరిశోధనలకు ప్రణాళికలు
- ఏఎన్‌యూలో సమావేశం.. హాజరైన ఆరు వర్సిటీల వీసీలు

పెదకాకాని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ విద్యా విధానం అమలు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో జపాన్‌కు చెందిన టొయామా విశ్వవిద్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం 2015 చేసుకున్న ఒప్పందం తిరిగి తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జపాన్ బృందంతో ఏపీలోని ఆరు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టోయామా యూనివర్సిటీతో ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలు, విద్యార్థి, అధ్యాపక, పరిశోధన రంగాలలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునేందుకు అంగీకారం లభించింది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్, పలు యూనివర్సిటీల వీసీలు తెలిపిన వివరాలను పరిశీలించిన జపాన్ ప్రతినిధుల బృందం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో కొలాబరేటివ్ డైలాగ్ ఆన్ ఎడ్యుకేషన్ బిట్వీన్ టోయామా ప్రీఫెక్చర్ అండ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై జరిగిన చర్చలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి తాత్కాలిక చైర్మన్ ఆచార్య కే.రామ్మోహనరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ దేశ విద్యా విధానాన్ని కొనసాగించే క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఉన్న జపాన్ విద్య విధానంపై ఏపీలో అమలు చేసే అంశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. 2047కి స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. అందులో భాగంగా జపాన్ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలుకు పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. జపనీస్ భాషపై ప్రత్యేక కోర్సును విద్యార్థులకు అందించాలని కూడా సూచించారన్నారు. నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య కే.గంగాధర రావు మాట్లాడుతూ వర్సిటీ నుంచి ఇద్దరు విద్యార్థులు సుకుర సైన్స్ ఎక్సేంజ్ ప్రోగ్రాంలో భాగంగా టొయామ యూనివర్సిటీని సందర్శించి పలు అంశాల్లో నైపుణ్యాలు పెంచుకున్నారన్నారు. ఇంటర్నేషనల్ అఫైర్స్ డివిజన్ డైరెక్టర్ యూకో హోంగో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని వర్సిటీలతో ఒప్పందాలకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వచ్చే నెలలో టొయామా గవర్నర్ ఆంధ్రప్రదేశ్ పర్యటన ఉంటుందని ఆపర్యటనలో ఒప్పందాలను ఖరారు చేసుకోనున్నట్లు తెలిపారు. యూజీ, పీజీ, రీసెర్చ్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫార్మసీవంటి కోర్సులపై దృష్టిసారిస్తామన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఉమామహేశ్వరిదేవి, ఇండస్ట్రియల్ లోకేషన్ అండ్ ట్రేడ్ డివిజన్ లాజిస్టిక్ అండ్‌ట్రేడ్ డైరెక్టర్ హిదేహిస, ఇంటర్నేషనల్ అఫైర్స్ డివిజన్ సెక్షన్ చీఫ్ ఏఐ డోబు, ఇంటర్నేషనల్ రిలేషన్స్ మాజీ కోఆర్డినేటర్ దాసరి రమేష్, పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య వెన్నం ఉమ, వెంకటేశ్వర యూనివర్సిటీ వీసీ ఆచార్య సిహెచ్. అప్పారావు, ఆంధ్ర యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, జేఎన్టీయూ అనంతపురం ఉపకులపతి ప్రొఫెసర్ హెచ్.సుదర్శన్‌రావు, జేఎన్టీయూ కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌డీ మురళీకృష్ణ, నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ ఎ.కృష్ణసత్య, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.పద్మావతి, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సిద్ధయ్య, ఆచార్య ప్రమీలారాణి, వెంకటేశ్వర యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాజశేఖర్, ఇండో జపనీస్ కొలాబరేషన్ కన్సల్టెంట్ స్వాతి భగవత్ తదితరులు పాల్గొన్నారు.

# చీఫ్‌విప్‌గా జీవీ

(5వ పేజీ తరువాయి)

చీఫ్‌విప్ పదవితో పార్టీ అధిష్ఠానం జీవీకి సముచిత స్థానం కల్పించింది. 2009, 2014లో జీవీ వినుకొండ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. టీడీపీలో వివిధ హోదాల్లో ఆయన పని చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లాకు టీడీపీ అధ్యక్షుడిగా దాదాపు పదేళ్ల బాధ్యతలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడి హోదాలో టీడీపీ సభ్యత్వ నమోదులో జీవీ పల్నాడు జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపి అధిష్ఠానం మన్ననలు పొందారు. ఇక ఆయన ఐదేళ్ల వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి అనేక పోరాటాలు చేశారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో శావల్యాపురం జడ్పీటీసీని గెలిపించి ప్రతిపక్షంలో కూడా ఆయన సత్తా చాటారు. జీవీకి పదవి దక్కడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పలువురు నేతలు జీవీని సత్కరించి ఆయనకు అభినందనలు తెలిపారు.

### సమర్థవంతంగా నిర్వహిస్తా : జీవీ

చీఫ్‌విప్‌గా బాధ్యతలు అప్పగించిన సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు జీవీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. సహచర ఎమ్మెల్యేలకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తానన్నారు. శాసన సభ విలువలు గౌరవం పెంచేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.



సతీమణి లీలావతికి మిఠాయి తినిపిస్తున్న జీవీ

### వినుకొండకు రెండోసారి పదవి

వినుకొండ నియోజకవర్గానికి రెండో సారి చీఫ్‌విప్ పదవి దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వినుకొండ నుంచి అప్పట్లో ఎమ్మెల్యేగా గెలిచిన నన్నపనేని రాజకుమారి చీఫ్ విప్‌గా పని చేశారు. ఆ తర్వాత జీవీని ఆ పదవి వరించింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, శావల్యాపురం జడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి, మేజర్ పంచాయతీల్లోని పలువురు సర్పంచ్‌లు, టీడీపీ నేతలు ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులుకి అభినందనలు తెలిపారు.

# పడవ రేవులకు గిరాకీ

- గింజుపల్లికి రూ.54 వేలు ఉంటే.. రూ.3.50 లక్షలకు పాట
- మాదిపాడుకు, తాడువాయి రేవులకు పోటాపోటీ
- వల్లభాపురానికి ఒక్కరు కూడా రాలేదు



జడ్పీ కార్యాలయంలో పడవ, బల్లకట్టు రేవులకు వేలం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని పడవ, బల్లకట్టు రేవులకు గిరాకీ పెరిగింది. రెండు దఫాలుగా వాయిదా పడుతూ వచ్చిన వేలం మంగళవారం విజయవంతంగా పూర్తయ్యింది. జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ వేలంలో రేవులు దక్కించుకునేందుకు పలువురు పోటీపడ్డారు. పెద్దగా ప్రాధాన్యం లేదనుకున్న అచ్చంపేట మండలంలోని రేవులకు భారీ మొత్తం చెల్లించేందుకు పలువురు ముందుకు వచ్చారు. అచ్చంపేట మండలం చామర్రు పడవ రేవుకు కనీస ధర రూ.1.15 లక్షలు నిర్ణయించగా, దానిని రూ.2.12 లక్షలకు జీ రామయ్య దక్కించుకున్నారు. చింతపల్లికి రూ.91667 అని నిర్ణయించగా, రూ.96000కు రమేష్ దక్కించుకున్నారు. గింజుపల్లికి 54,167 అని నిర్ణయించగా కే వసంతారావు 3.50 లక్షలకు దక్కించుకున్నారు. తాడువాయి రేవుకు రూ.4,72,083 కనీస ధర కాగా, రమేష్ అనే వ్యక్తి రూ.7 లక్షలకు దక్కించుకున్నారు. మాదిపాడు రేవుకు రూ.5,52,083 కనీస ధర కాగా, సతీశ్ కుమార్ అనే వ్యక్తి దానిని రూ.11.20 లక్షలకు దక్కించుకున్నారు. మాదిపాడు బల్లకట్టుకు రూ.4,16,667 కనీస ధరకాగా అబ్దుల్ సత్తార్ అనే వ్యక్తి రూ.4.27 లక్షలకు దక్కించుకున్నారు. మాచవరం మండలం లోని గోవిందాపురం బల్లకట్టుకు రూ.3,33,333 కనీస ధరగా నిర్ణయించగా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి 3,45,000కి దక్కించుకున్నారు. అమరావతి మండలం లోని దిడుగు పడవ రేవుకు రూ.2,77,083 కనీస ధర కాగా చంద్రశేఖర్ అనే వ్యక్తి రూ.2,88,000కు దక్కించుకున్నారు. ధరణికోట పడవ రేవుకు రూ.20,833 కనీస ధరగా నిర్ణయించగా, గోవింద్ అనే వ్యక్తి రూ.76,000కు దక్కించుకున్నారు. కొల్లిపొర మండలంలోని వల్లభాపురం రేవుకు ఎవరూ ముందుకు రాలేదని కృష్ణ తెలిపారు.

## ఏఎన్‌ఎంలకు ఇతర విధులు వద్దు..

- 'హంస' విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

గుంటూరు సిటీ, నవంబరు 12( ఆంధ్రజ్యోతి): జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలను ఇతర విధులకు వినియోగించవద్దని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కే.విజయలక్ష్మీ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సచివాలయ పరిధిలో వస్తున్న వివిధరకాల సర్వేలకు ఏఎన్‌ఎంలు హాజరు కావాల్సిందే అంటూ పంచాయతీ సెక్రటరీలు ఒత్తిడి చేస్తున్నట్లు ఏపీ హంస యూనియన్ జిల్లావైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఏఎన్‌ఎంలు నిర్వర్తించవలసిన విధులపై స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు సోమ, గురువారం అడల్ట్ బీసీజీ వాక్సినేషన్, బుధ, శనివారం రొటీన్ ఇమ్యునైజేషన్, శుక్రవారం ఫ్రైడే డ్రైడే మాత్రమే నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీ.నాగవర్ధన్ వెల్లడించారు. ఏఎన్‌ఎంలకు అనుకూలంగా ఉత్తర్వులు జారీచేసిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె విజయలక్ష్మీకి అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు

పట్టాయాలో జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీల్లో సాధించిన గోల్డ్ మెడల్ తో నిశ్శంకర్రావు రవికుమార్



థాయిలాండ్‌లో మెరిసిన

# గుంటూరు కుర్రోడు

**వరల్డ్ బాడీ బిల్డింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన రవికుమార్**

గుంటూరుసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): థాయిలాండ్ పట్టాయాలో జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకం అంబరాన్ని అంటింది. గుంటూరు జిల్లా ఏటుకూరుకు చెందిన నిశ్శంకర్రావు రవికుమార్ (రవి) 65-70 కేజీల విభాగంలో ప్రపంచ స్థాయిలో స్వర్ణ పతాకం సాధించారు. ఈనెల 9,10తేదీల్లో పట్టాయాలో ఈ పోటీలలో రవికుమార్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించారు. రవికుమార్ గతంలోనూపలు జాతీయ, అంత ర్జాతీయ బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించారు. 2018లో పూణేలో జరిగిన పోటీల్లో కాంస్యం, 2019 లో ఇండోనేషియా జరిగిన పోటీల్లో స్వర్ణం, 2021లో ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన పోటీల్లో కాంస్యం, 2022లో సౌత్ కొరియాలో జరిగిన పోటీల్లో కాంస్యం, 2023 లో ఫిలిప్పీన్స్ లో జరిగిన పోటీల్లో ఏషియా సిల్వర్ మెడల్స్ సాధించారు. నిశ్శంకరరావు రవికుమార్ తండ్రి వెంకట్రావు లారీడ్రైవర్ కాగా, తల్లి నరసమ్మ గ్రామం లోనే చిన్న చిల్లరదుకాణం నడుపుతున్నారు. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఈ యువ బాడీ బిల్డర్ గత తొమ్మిది సంవత్సరాలుగా కఠోర శిక్షణ తీసుకుంటున్నారు. థాయిలాండ్‌లో ఉన్న రవికుమార్ ఫోన్ లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీలో స్వర్ణం సాధించటం సంతోషం కలిగించిందన్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మరిన్ని గోల్డ్‌మెడల్స్ తీసుకు వస్తానన్న ధీమా వ్యక్తంచేశారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం ఏమాత్రం ఆదరణ చూపించలేదని ఆవేదన చెందారు. అప్పుడు ప్రభుత్వం చేయూత నిచ్చివుంటే రాష్ట్రానికి చాలా మెడల్స్ వచ్చి ఉండేవని అన్నారు. థాయ్‌లాండ్ నుంచి రాగానే ప్రభుత్వ పెద్దలను కలుస్తానని నిశ్శంకర్రావు రవికుమార్ తెలిపారు.



గతంలో సీఎం చంద్రబాబు నాయుడుని కలిసిన రవికుమార్

# పల్నాడు వార్తలు

నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

## సచివాలయాల్లో డీఎల్‌డీవో తనిఖీ

వినుకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయపాలెం, ఉప్పరపాలెం గ్రామాల సచివాలయాలను డీఎల్‌డీవో వెంకటరెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయం సిబ్బందితో సమీక్ష నిర్వహించి సిబ్బంది హాజరు, ఎస్‌పీసీఐ డేటా, అప్‌డేషన్ హౌస్‌హోల్డర్స్ జియో, కో ఆర్డినేషన్ అప్‌లోడ్ చేయడం గురించి పలు సర్వీసులపై సమీక్ష నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### నేడు, రేపు గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు

రొంపిచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 13, 14 తేదీల్లో ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మాధ్యూబాబు మంగళవారం తెలిపారు. 13వ తేదీన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు హాజరు కావాలన్నారు. 14వ తేదీన జడ్పీటీసీ, పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వీవోఏలలో ఒకరు హాజరు కావాలన్నారు.

### ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్ ఆవిష్కరణ

రొంపిచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎంఎంఎస్ కోసం తయారు చేసిన మెటీరియల్‌ను ఎంఈవో బ్రహ్మేశ్వరరావు మంగళవారం రొంపిచర్లలోని మండల వనరుల కేంద్ర భవనంలో ఆవిష్కరించారు. కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వై.మల్లికార్జునరావు ఈ పుస్తకాన్ని తయారు చేశారు.

### బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

శావల్యాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో శావల్యాపురం మండలం మతుకుమల్లిలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకొని 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నట్లు వినుకొండ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ నెల ప్రారంభం నుంచి నూజండ్ల మండలంలోని రవ్వారం, కంభంపాడు, వినుకొండ మండలంలోని పెరుమాళ్ళపల్లి, తిమ్మాయిపాలెం, వినుకొండ పట్టణాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఏడుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకొని వారి వద్ద మొత్తం 70 మద్యంసీసాలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

### పౌష్టికాహారం పంపిణీ

ఈపూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నరసరావుపేట సేవా సంస్థ గర్భిణులకు ప్రతి నెల పౌష్టిక ఆహారం పౌడర్ పంపిణీ పథకంను ప్రారంభించారు. కడియం నుంచి తెప్పించిన 150 మొక్కలు పీహెచ్‌సీలో, 50 మొక్కలు జిల్లా సేవా సంస్థ ప్రతినిధులు నాటారు.

### టీకాల నిర్వహణపై శిక్షణ

నరసరావుపేట లీగల్, నవంబరు 12: పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని ఫార్మసిస్టులకు స్టాఫ్ నర్సులకు వ్యాక్సిన్ మేనేజ్మెంట్ గురించి ఒక రోజు శిక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బి రవి వ్యాక్సిన్ నిల్వచేసే విధానం లబ్ధిదారుకు చేరవేతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వలెన్స్ అధికారి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

### నిమోనియాపై సర్వే

నరసరావుపేట లీగల్, నవంబరు 12, పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు నిమోనియా వ్యాధిపై సర్వే నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి మంగళవారం తెలిపారు. పట్టణంలోని పల్నాడు బస్టాండ్‌లోని పాత ప్రభుత్వ వైద్యశాల ప్రసూతి వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి వైద్యశాల సూపరింటెండ్ డాక్టర్ మంత్రూనాయక్, డాక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

### హామీలను నెరవేర్చాలి: గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రవేశ పెట్టవలసిన బడ్జెట్‌ను ఆరు నెలల సమయం గడిపి కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టారన్నారు. ఈ బడ్జెట్లో చంద్రబాబు నాయుడు రైతులను, మహిళలను మోసగించేలా కేటాయింపులు ఉన్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని గోపిరెడ్డి డిమాండ్ చేశారు.

### మేళాలో 34 మందికి ఉద్యోగాలు

వినుకొండ టౌన్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపేలా పట్టణంలోని గంగినేని డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజిరావు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళలో 3కంపెనీలు హాజరుకాగా 68మంది నిరుద్యోగులు ఈ డ్రైవ్‌లో పాల్గొనగా 34మంది ఉద్యోగాలు ఎంపికయ్యారని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### గోడపత్రాల ఆవిష్కరణ

వినుకొండ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివయ్య భవన్‌లో మంగళవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల గోడప్రతులను ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దేటి అభిషేక్ మాట్లడుతూ ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయని, పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

- నాలుగు దశాబ్దాలుగా సొంత భవనం నిల్
- 2019లో రూ.90లక్షలు మంజూరు
- రివర్స్ టెండరింగ్‌లో నిలిచిన పనులు
- శిథిలావస్థలో ప్రస్తుత వైద్యశాల భవనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, అధికారులు



నూజెండ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పరిపాలన సులభతరం చేసేందుకు మండల వ్యవస్థ తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో రెవెన్యూ, అభివృద్ధి అధికారులకు కార్యాలయాలు ఏర్పాటుచేసి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. పాలకులు, ప్రభుత్వ అధికారులు వీటిపై శ్రద్ధ చూపకపోవటంతో నేటికి మండల స్థాయి అధికారులకు కార్యాలయాలు లేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మండల రెవెన్యూ కార్యాలయం కొద్దికాలం ఎన్ఎస్‌పీ క్వార్టర్స్‌లో కొనసాగించారు. ఐదు సంవత్సరాల క్రితం తాత్కాలికంగా వైద్యశాలకు తరలించారు. అనంతరం 2019లో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.90లక్షలు రెవెన్యూ డీఏ అండ్ ఎల్ఆర్ గ్రాంటు మంజూరుచేశారు. కాంట్రాక్టర్ ఎన్నికల నాటికి 25శాతం కంటే తక్కువ పనులు చేయటంతో వైసీపీ ప్రభుత్వంలో రివర్స్ టెండరింగ్‌లో భాగంగా పనులు నిలిపివేశారు. కాగా గత ప్రభుత్వ పాలనలో అధికారులు, పాలకులు శ్రద్ధ చూపకపోవటంతో ఫౌండేషన్ వరకే పూర్తయింది. భవన నిర్మాణానికి వినియోగిస్తున్న ఇనుము, ఇతర సామాన్లు తుప్పుపట్టిపోతున్నాయి. సరైన కార్యాలయం లేక అధికారులు విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కార్యాలయంలోకి రికార్డులను భద్రపరిచేందుకు సరైన భద్రత లేకపోవటం, వర్షపునీరు వస్తుండటం, సమస్యగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెవెన్యూ కార్యాలయ భవనాన్ని త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### కార్యాలయం లేక ఇబ్బందులు పడుతున్నాం

- తహసీల్దార్ రమేష్ కుమార్



మండల రెవెన్యూ కార్యాలయం లేక ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దార్ జీ రమేష్ కుమార్ అన్నారు. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు తహసీల్దార్ కార్యాలయ నిర్మాణంపై నివేదిక కోరగా ప్రస్తుత పరిస్థితిని తెలియజేస్తూ నివేదిక అందజేశామన్నారు. ప్రస్తుతం కార్యాలయంగా వినియోగిస్తున్న వైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్న దృష్ట్యా రెవెన్యూ శాఖకు సొంత భవనం అవసరమన్నారు.

### భవనం నిర్మిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది

- లగడపాటి సూరిబాబు



మండల రెవెన్యూ కార్యాలయ భవనం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావటం ద్వారా అధికారులు, ఉద్యోగులు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు లగడపాటి సూరిబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. రెవెన్యూ కార్యాలయ నిర్మాణ ఆవశ్యకతను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకువెళ్ళగా తగుచర్యలు తీసుకోనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారని వివరించారు.

## ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం

ఎమ్మెల్యే జీవీ



ఎన్‌డీఏ శాసనసభపక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గవ్యాప్తంగా ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై వివరాలు సేకరించి అధ్యయనం చేస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజధాని అమరావతిలోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన ఎన్‌డీఏ శాసనసభపక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. శాసనసభ, మండలిలో అనుసరించే వ్యూహం, రాజకీయ పరిణామాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్ చాలా విలువైన విషయాలపై మార్గనిర్దేశం చేశారని ఎమ్మెల్యే జివి ఆంజనేయులు తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని అనవసర విషయాల జోలికి ఎవరూ పోవద్దని సూచించారు. ఇసుక, మద్యం విధానాలకు సంబంధించి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురాకుండా చూసే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని తెలిపారన్నారు. నూతన ఇసుక విధానాన్ని అధ్యయనం చేసి, వ్యవస్థాగతంగా ఏమైన లోపాలు గుర్తిస్తే తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం, సీఎం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. పర్యాటక రంగం అభివృద్ధిపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. గతంలో వైసీపీ నేతలు చేసిన తప్పులు కూటమి హయాంలో ఎవరూ చేయవద్దని సీఎం గట్టిగా సూచించారని, ఈ విషయాన్ని నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ గమనించి పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అన్నక్యాంటీన్లు ప్రారంభం, ధాన్యం, ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల, నూతన రోడ్ల నిర్మాణం, రహదారులకు మరమ్మతులు, పల్లె పండుగ పేరిట గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఇంటి నిర్మాణాలకు సాయం పెంపు, కొత్త పారిశ్రామిక విధానం, ఉద్యోగ, ఉపాధి కల్పనకు తీసుకుంటున్న చర్యలన్నీ ప్రజలకు వివరిస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఈ సందర్భంగా తెలిపారు.

### సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, నవంబరు, 12: పల్నాడు జిల్లాలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సహకార సంఘ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. వారోత్సవాలలో భాగంగా ఈ నెల 14 నుంచి 20 వరకు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీసీవో వెంకటరమణ, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి నాగ శ్రీనివాస్, జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### విద్య ద్వారానే సమాజంలో చైతన్యం: హెచ్‌ఎం రాజ్యలక్ష్మి

నరసరావుపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే సమాజంలో చైతన్యం వస్తుందని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.రాజ్యలక్ష్మి తెలిపారు. కార్డ్ సంస్థ బాలబాట ఆర్గనైజర్ల సమావేశానికి నరసరావుపేట మండలం బస్టాండ్ దగ్గర ఎస్టీ కాలనీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి స్థానిక నరసరావుపేట మండల ఏరియా కోఆర్డినేటర్ ఎం కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పలనాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జి సుబ్బారావు, మండల కోఆర్డినేటర్స్ ఎం కోటేశ్వరరావు, ఏ రాజు బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

### అటవీ శాఖకు 600 మొక్కలు అందజేత

వినుకొండ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి ప్రేమ తరువు అనే కార్యక్రమంలో భాగంగా వెల్లటూరు రోడ్డులోని అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న నగర వనంలో సేవా సమితి వారు 600మొక్కలను మంగళవారం అటవీశాఖ అధికారులకు అందజేసి మొక్కలు నాటారు. సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ దేశం మొత్తం కోటి మొక్కలను నాటాలని తమ సమితి నిర్ణయించిందని, ఇందులో భాగంగా వినుకొండ, నర్సరావుపేట సమితిల ఆధ్వర్యంలో మొక్కలను అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉమామాధవ్, వినుకొండ అధ్యక్షుడు సాయిప్రసాద్, వినుకొండ అటవీశాఖ రేంజ్ అధికారి మాధవ్, సమితి సభ్యులు పాల్గొన్నారు.

### అధిక ధరలకు అమ్మితే భారీ జరిమానా, లైసెన్స్ రద్దు

- డీసీ శ్రీనివాస్

నర్సరావుపేట లీగల్, నవంబరు 12: ఇటీవల లాటరీలో వైన్ షాప్‌లను దక్కించుకున్న నిర్వాహకులు నిబంధన ఉల్లంఘించి మద్యాన్ని అధిక ధరలకు అమ్మినా, బెల్ట్ షాపులు నిర్వహించిన రూ.5లక్షలు జరిమానాతో పాటు, షాప్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారీదారులకు మొదటిసారి కేసు నమోదు చేయడంతో పాటు రెండు లక్షల రూపాయలకు బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. మరలా ఇదే నేరానికి పాల్పడితే రెండు లక్షల రూపాయలు వసూలు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పీడీ చట్టం కూడా వారిపై అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఏసీఎం విజయ్ కుమార్ రెడ్డి, నరసరావుపేట ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీంద్ర, టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సూర్యానారాయణ, నరసరావుపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సోమయ్య పాల్గొన్నారు.

### రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్లకు ఎమ్మెల్యే సత్కారం

నరసరావుపేట టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావును రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో మంగళవారం వెలగపూడిలోని సచివాలయ ఆవరణలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును గోనుగుంట్ల కోటేశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గోనుగుంట్ల కోటేశ్వరరావును సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

### రైతులు పంటల బీమా పథకాన్ని వినియోగించుకోవాలి: ఏవో

రొంపిచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల బీమా పథకాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి శివలలిత మంగళవారం తెలిపారు. మండలంలోని మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, సుబాబులు పంటలను పరిశీలించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మందులను వాడి అధిక దిగుబడులు సాధించాలని కోరారు.

### బాధ్యతగా పనిచేస్తా: రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల



నరసరావుపేట టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా విద్యార్థులకు, రైతులకు ఉపయోగపడేలా బాధ్యతగా పనిచేస్తానని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ముందుగా తనకు పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి, నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. గడిచిన ఐదేళ్ళ గ్రంథాలయ నిధులు పక్కదారి పట్టించి, ఉద్యోగులకు జీతాలు లేకుండా చేశారని, దీనిని గాడిలో పెడతానన్నారు. కార్యకర్తల సమస్యలు సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే వారధిగా ఉంటానన్నారు. సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పొనుగోటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, బొడ్డుపాటి పేరయ్య, మాజేటి వెంకటేష్, వనమా శివ, షేక్ మహమ్మద్ రఫీ, మందలపు వెంటరత్నం తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి: డీఈవో చంద్రకళ



విద్యార్థుల సామర్థ్యంను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

వినుకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని తీసుకోవాలని డీఈవో చంద్రకళ ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాటశాల్లో మంగళవారం సాధారణ తనిఖీల్లో భాగంగా డీఈవో చంద్రకళ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యంను పరిశీలించారు. పాఠశాల్లోనే ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం చేసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా విద్యార్థిని ఎక్కువరోజులు సెలవులు పెడితే విషయం తెలుసుకొని వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో నలుగురు విద్యార్థులు పాఠశాలకు రావడం లేదని తెలుసుకుని పట్టణంలోని మసీదుమాన్యం, రైలుపేటలో నివాసం ఉంటున్న విద్యార్థుల ఇళ్ల దగ్గరకు వెళ్ళి వారి తల్లిదండ్రులతో మాట్లాడి మరల పాఠశాలకు వచ్చేలా డీఈవో ఒప్పించారు. డీఈవోతోపాటు ఎంఈవో సయ్యద్ జఫ్రుల్ల, హెచ్‌ఎం నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

### ఉపాధి హామీ పనుల ఆమోదంపై గ్రామసభలు

శావల్యాపురం, నవంబరు 12: (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో గుర్తించిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేసి వారి ఆమోదాన్ని పొందేందుకు మండలంలోని బొందిలిపాలెం, మతుకుమల్లి, చిన్నకంచెర్ల గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలను మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య మాట్లాడుతూ ఇటీవల మండలంలోని 15గ్రామపంచాయతీలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది కలసి గుర్తించడం జరిగిందన్నారు. బొందిలిపాలెంలో రూ.75,87,000 విలువైన 96పనులు, మతుకుమల్లిలో రూ.1,06,82,000 విలువైన 106 అభివృద్ధిపనులు, చిన్నకంచెర్లలో రూ.48,73,000 విలువైన 56పనులను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పూరేటి నాగేశ్వరరావు, యలగాల బసవయ్య, ఏపీవో కటారపు రామారావు, పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు, శ్రీవల్లి, బాలపరమేశ్వరరావు, గ్రామ నాయకులు పూరేటి వెంకట్రావు, మల్నీడి శ్రీనివాసరావు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 16 గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

యడ్లపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో విద్యుత్‌శాఖ సీఆర్‌డీఏ సర్కిల్ ఎస్ఈ పి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఈఈ, విజిలెన్స్ ఈఈ సీహెచ్ వెంకటేశర్లు గుంటూరు 2 టౌన్ ఈఈ సీహెచ్ రమేష్‌ల నేతృత్వంలో 32 బృందాలు ఈ తనిఖీలలో పాల్గొన్నాయి. తనిఖీల అనంతరం యడ్లపాడు సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విజిలెన్స్ ఈఈ మాట్లాడుతూ 16 గ్రామాలలోని గృహ, వాణిజ్య సముదాయాలకు సంబంధించి 2,429 సర్వీసులను తనిఖీచేసి, వీటిలో 2394 గృహాలు, 35 వాణిజ్య సర్వీసులు ఉండగా విద్యుత్ చౌర్యం, అధిక లోడు వినియోగిస్తున్న వారిపై 53 కేసులు నమోదు చేశారన్నారు. అధికలోడు వినియోగిస్తున్న 51సర్వీసులకు రూ.1,94,300, మీటరు లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.3వేలు అపరాధ రుసుం విధించినట్లు వెల్లడించారు. తనిఖీలలో డీఈఈ ఎ.గురునాదరావు, చిలకలూరిపేట డీఈఈ అశోక్‌కుమార్, యడ్లపాడు ఏఈఈ జెస్సీ జయశంకర్ పాల్గొన్నారు.

### దరఖాస్తులను పరిష్కరిస్తాం

- తహసీల్దార్ శివలలిత






రొంపిచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తామని తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రామసభలపై ఆంధ్రజ్యోతికి తెలిపిన వివరాలు..

**ప్రశ్న:** రెవెన్యూ గ్రామ సభలు ఎన్ని జరిగాయి?

**జవాబు:** రెవెన్యూ శాఖ ద్వారా రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. 11 గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు.

**ప్ర:** ఎన్ని అర్జీలు వచ్చాయి?

**జ:** 179 అర్జీలు రైతులు అందజేశారు. వీటిలో 11 పరిష్కరించాం. మిగిలినవి కూడా త్వరలో పరిష్కరిస్తాం.

**ప్ర:** పట్టభద్రుల ఎన్నికకు ఎన్ని దరఖాస్తులు అందాయి?

**జ:** 1107 దరఖాస్తులు అందాయి. వీటిని సంబంధిత బూత్ లెవల్ అధికారి తనిఖీ చేస్తున్నారు.

**ప్ర:** వీఆర్‌వోల కొరత ఉందా?

**జ:** తురుమెళ్ళ, గోగులపాడు, కొత్తపల్లి రెవెన్యూ గ్రామాలకు వీఆర్‌వోలు రావాల్సి ఉంది. వీరితో పాటు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ కావాల్సి ఉంది.

### బాలయ్య నగర్‌లో చప్టాను పునరుద్ధరించరూ...




నరసరావుపేటలోని బాలయ్య నగర్ ప్రధాన రహదారిపై కొద్ది నెలల క్రితం చప్టా కూలింది. నెలలు గడుస్తున్నా చప్టాను పునరుద్ధరించలేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రాత్రివేళలో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలు జరగకముందే మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి చప్టా నిర్మించాలని పలువురు కోరుతున్నారు. - నరసరావుపేట, ఆంధ్రజ్యోతి



### జీవీ ఆంజనేయులుకు సత్కారం

వినుకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చీఫ్‌విప్‌గా ఎన్నికైన వినుకొండ సీనియర్ శాసనసభ్యుడు జీవీ ఆంజేయులును మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు మంగళవారం సత్కరించారు. క్యాబినేట్ హోదా గల చీఫ్ విప్ పదవిపై లభించటంపై పలువురు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

### గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే జీవీ



మంత్రి గుమ్మడి సంధ్యారాణితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలోని ఎస్టీ కాలనీలు, తండాల సమస్యల పరిష్కారాలు, అభివృద్ధి పనులు నిమిత్తం మంగళవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో వినుకొండ నియోజకవర్గ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్టీ కాలనీలు, తండాల్లోని సమస్యలు మంత్రికి వివరించి మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని ఎమ్మెల్యే జీవీ కోరారు. గ్రామ పంచాయతీలకు సాధారణంగా కేటాయిస్తున్న నిధులకు తోడు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాల్సిన అవసరం ఉందని మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

### నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కోరారు. మంగళవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రులను కలిసి వినతి పత్రాలను అందజేశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మైనారిటీ మంత్రి ఫరూక్ అబ్దుల్లా, ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, తదితరులను కలిశారు.